మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 15-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 106 Issue: 106

Published from Jagitial
www.evarthalu.com


15 అక్టోబర్ 2025 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:12 సూర్యాస్తమయం - సా. 5:50 తిథిః నవమి ఉ. 10:36 వరకు తరువాత దశమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పుష్యమి మ. 12:00 వరకు తరువాత ఆశ్లేష యోగం సాధ్య రా. 2:50ం వరకు కరణం గరజి ఉ. 10:36 వరకు వనిజ రా. 10:34 వరకు వర్జ్యం రా. 1:10 నుండి రా. 2:49 వరకు దుర్ముహూర్తం ఉ. 11:38 నుండి మ. 12:25 వరకు రాహుకాలం మ. 12:01 నుండి మ. 1:29 వరకు యమగండం ఉ. 7:40 నుండి ఉ. 9:07 వరకు గుళికాకాలం ఉ. 10:34 నుండి మ. 12:01 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:36 నుండి తె. 5:24 వరకు అమృత ఘడియలు ఉ. 6:05 నుండి ఉ. 7:41 వరకు అభిజిత్ ముహూర్తం లేదు



# మల్లోజుల గన్ డౌన్


**60 మందితో కలిసి లొంగుబాటు**

**ఇదివరకే 22 పేజీల లేఖ విడుదల**

**ఆయుధాలను వీడుతానని వెల్లడి**

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోను మంగళవారం రోజు లొంగిపోయారు. ఆయుధాలను వీడి అధికారికంగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. అయితే ఈయనతో పాటు మరో 60 మంది మావోయిస్టులు కూడా లొంగిపోయారు. ని ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ వెల్లడించారు.

గడ్చిరోలి, అక్టోబర్ 14 (ఈవార్తలు): మావోయిస్టు నేతలు జనజీవన స్రవంతిలో కలవడం తమకు ఎంతగానో సంతోషాన్ని ఇస్తుందని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా నక్సలిజం పూర్తిగా అంతం కావాలని బస్తర్ ప్రజలు కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. మల్లోజుల వేణుగోపాల్ రావు మావోయిస్టు పార్టీలో అగ్రనేతగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా సుదీర్ఘ కాలం పాటు కీలక పాత్ర పోషించారు. అయితే గత కొంతకాలంగా ఆయన పార్టీ విధానాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ.. కొద్ది రోజుల క్రితమే ఆయన ఒక సంచలన లేఖను విడుదల చేశారు. మొత్తంగా 22 పేజీల్లో రాసిన ఈ లేఖలో.. పార్టీ లక్ష్యం గతి తప్పిందని, అనవసర త్యాగాలు ఇక అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆయుధాలు వీడాలన్న తన నిర్ణయానికి గల కారణాలను వివరిస్తూ.. తనతో పాటు కేడర్‌లో తరువాయి 2 వ పేజీలో...



# నాపై రెడ్ల కుట్ర

## కొందరు నన్ను టార్గెట్ చేశారు.. ప్రతి మాటను కాంట్రవర్సీ చేస్తున్నారు

## నాగార్జున విషయంలోనూ అదే చేశారు.. మంత్రి కొండా సురేఖ ఆవేదన



కొంతమంది రెడ్లు తనను టార్గెట్ చేశారని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఏది మాట్లాడినా వివాదాస్పదం చేస్తున్నారని వాపోయారు. మంగళవారం హనుమకొండ జిల్లాలో మీడియాతో చిట్‌చాట్‌లో పాల్గొన్న ఆమె.. కొంత మంది రెడ్లు తాను మాట్లాడే ప్రతీ మాటను వక్రీకరిస్తున్నారని అన్నారు. గతంలో నాగార్జున విషయంలో తాను మాట్లాడిన మాటల్ని కూడా కాంట్రవర్సీగా వక్రీకరించారన్నారు. అందుకే అంత పెద్ద వివాదంగా మారిందన్నారు.

హనుమకొండ, అక్టోబర్ 14 (ఈవార్తలు):తమ ఆధిపత్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. అందుకే మౌనంగా తన పనులు తాను చేయాలనుకుంటున్నానని తెలిపారు. ఎవరినో ఏదో చేయడానికి ఢిల్లీ, హైదరాబాద్‌లో లాబీయింగ్ చేయాల్సిన అవసరం తనకు లేదని చెప్పారు. ఏది ఉన్నా పార్టీ అధిష్ఠానానికే నేరుగా చెప్పి రాజకీయాలు చేస్తానని అన్నారు. ఎవరు ఏమనుకున్నా మంత్రిగా తన బాధ్యతలు తనకు తెలుసునన్నారు. ఇక, పనులు వేగంగా జరగాలన్నదే తనది, సీఎం రేవంత్ ఆలోచన అని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ప్రతి విషయం ఓపెన్‌గా మాట్లాడటం తనకు అలవాటు అని చెప్పుకొచ్చారు. మేడారం టెండర్ల విషయంలో తనకు ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవన్నారు సురేఖ. మూడు కంపెనీలు టెండర్లు వేశాయని, అందులో ఎవరి ఎలిజిబులిటీ వారిదని తెలిపారు. 'మంత్రిగా నాకు, నా శాఖ కార్యదర్శికి ప్రతి విషయం మా నోటీసులో ఉండాలనేదే నా ఉద్దేశమ'న్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ విషయంలో తాను మాట్లాడింది ఒకటైతే, కొంత మంది ప్రచారం చేసింది మరొకటని అన్నారు. ప్రతిదాన్ని కాంట్రవర్సీ అయ్యేలా చేస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా, తనపై కొండా దంపతులు కాంగ్రెస్ హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించిన విషయం తెలిసిందే. రూ.70 కోట్ల కాంట్రాక్టు కోసం ఆరాటపడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖలు ఇద్దరూ సమ్మక్క, సారక్కల్లా పనిచేస్తున్నారని ప్రశంసించడం గమనార్హం.

### కొండా సురేఖ ఓఎస్డీ తొలగింపు

మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ ఎన్ సుమంత్‌పై వేటుపడింది. కొండా సురేఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుమంత్.. ఆమెకు ఓఎస్డీగా తరువాయి 2 వ పేజీలో...



# రెడ్లు లేకుండా బతక్కగలరా?

**మా దగ్గర డబ్బులు అడుక్కోకుండా ఉంటారా?**

**బీసీ సంఘాలు పెట్టి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు**

**తెల్లారితే రెడ్ల ఆశీస్సులు, డబ్బులు తీసుకుంటారు**

**మున్నూరుకాపులకు రిజర్వేషన్లు ఎందుకు?**

**రెడ్డి జాగృతి మాధవరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు**

రెడ్లు లేకుండా ఏ ఒక్క బీసీ నాయకుడైనా బతక్కగలడా? అని రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 50 శాతం సీలింగ్ బ్రేక్ చేసి రిజర్వేషన్లు కల్పించేందుకు ఏ రాష్ట్రం ముందుకు వచ్చినా, అక్కడ ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఓడిపోయాయని, బీసీ నాయకులు ఈ విషయాన్ని చెప్పకుండా మాట్లాడుతున్నారని అన్నారు. రెడ్లను ఓట్లు అడగం, రెడ్ల వద్దకు పోమని చాలామంది బీసీ నాయకులు మాట్లాడుతున్నారని, అలాంటి వారికి చాలెంజ్ చేస్తున్నానని ఓ సవాల్ విసిరారు.

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): 'ఏ బీసీ నాయకుడైనా రెడ్ల వ్యాపారులు, రెడ్ల నాయకుల వద్ద డబ్బులు అడుకోక్కుండా సంస్థలు నడుపుతామని అనగలడా?' అని నిలదీశారు. వాళ్ల బతుకుదెరువు కోసం సంఘాలు పెట్టి రెడ్లను డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. పొద్దునలేస్తే రెడ్ల ఆశీస్సులు, డబ్బులు తీసుకుని.. మళ్లీ రెడ్లనే విమర్శిస్తున్నారని అన్నారు. ఈ తప్పంతా తమ రెడ్లదేనని, ఇలాంటి చీడపురుగులు ఉంటాయని చేరేదీసేముందు ఆలోచించలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. రెడ్లు అంటే సమాజం మేలు కోరేవారమని పేర్కొన్నారు. ఇక, రాజ్యాంగంలో తొలుత ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, ఆ తర్వాత బీసీలకు జనాభా పరంగా కాకుండా ఆర్థిక పరంగా రిజర్వేషన్లు కల్పించారని మాధవరెడ్డి చెప్పారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు అంటున్నారు.. ఒక వేళ దేశంలో ముస్లింల జనాభా పెరిగితే పెరిగిన జనాభా ప్రకారం వారికి రిజర్వేషన్లు ఇస్తారా? అని ప్రశ్నించారు. బీసీలకు రిజర్వేషన్లే లేవని, ఆర్థిక అసమానతల ఆధారంగానే వారికి తరువాయి 2 వ పేజీలో...



# సుప్రీంలో ఎస్ఎల్పీ

**బీసీ రిజర్వేషన్లపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు**

**గురు, శుక్రవారాల్లో విచారణకు అవకాశం**

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఈ నెల 9వ తేదీన హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ఈ ఎస్ఎల్పీ పిటిషన్ వేసింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేవని ఎస్ఎల్పీలో తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,835 |
| వెండి (గ్రాము): | రూ.206 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,760 |

## విశ్వవాణి



కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు, జంతువుల హత్యలను అరికట్టేందుకు అమెరికాలోని మైకోవర్క్స్ బయోటెక్ స్టార్టప్ ల్యాబ్‌లోనే పుట్టగొడుగులతో లెదర్‌ను తయారు చేసే పద్ధతిని అభివృద్ధి చేసింది. ఈ పద్ధతి ద్వారా వారాల్లోనే లెదర్‌ను ఉత్పత్తి చేయవచ్చని ఆ స్టార్టప్ ప్రతినిధులు పేర్కొన్నారు.

# ఐదేళ్లు ఉంటేనే డీసీసీ

## రెండో సారి అధ్యక్ష చాన్స్ ఉండదు

**బంధువులకూ అవకాశం లేదు... పలు నిబంధలు పెట్టిన ఏఐసీసీ**



రాష్ట్రంలో డీసీసీ అధ్యక్షుల ఎంపికకు సంబంధించి ఏఐసీసీ పలు నిబంధనలు తెరపైకి తెచ్చింది. డీసీసీ అధ్యక్షులుగా దరఖాస్తులు చేసుకునేవారు ఐదేళ్లపాటు పార్టీలో కొనసాగి ఉండాలని..ఇప్పటికే పనిచేసిన డీసీసీ అధ్యక్షులకు రెండోసారి అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధుల బంధువులకు కూడా డీసీసీ అధ్యక్ష పదవికి అవకాశం లేదని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళ నాయకులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న ఏఐసీసీ ప్రతినిధులతో ఆశావహులు ఎవరు కూడా వ్యక్తిగత సంభాషణలు, సమావేశాలు పెట్టవద్దని హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు ఆదివారం నుంచి జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఏఐసీసీ పరిశీలకులలో మాజీ ముఖ్యమంత్రి



# బనకచర్ల ఆపండి

## ఏపీ సర్కారును నిలువరించండి.. కేంద్రానికి తెలంగాణ సర్కారు లేఖ

పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో గుర్తు చేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే, నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింక్ ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర తరువాయి 2 వ పేజీలో...



# మాగంటి సునీతకు కేసీఆర్ బీఫాం

**ఎన్నికల ఖర్చులకు రూ.40 లక్షలు**

**నేడు తొలి సెట్ నామినేషన్ దాఖలు**

**19న భారీ ర్యాలీగా రెండో సెట్**

హైదరాబాద్, అక్టోబర్14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మంగళవారం బీఫాం అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం రూ.40లక్షల చెక్కును అందజేశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌లో మాగంటి సునీత కుటుంబ తరువాయి 2 వ పేజీలో...



3

# సునీత ఏడుపు డ్రామా

**అంతా ఆర్టిఫిషియల్ ఏడుపు**

**పొన్నం వివాదాస్పద వ్యాఖ్యలు**

**ఆడకూతురు కన్నీళ్లనూ బీఆర్ఎస్ వదలడం లేదు**

**మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు షాకింగ్ కామెంట్స్**

# గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18న నియామకపత్రాలు అందజేయనున్నారు. ఈ నెల 18న సాయంత్రం శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను ప్రదానం చేయనున్నారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-2లో 783 మంది ఎంపికయ్యారు. సాధారణ పరిపాలన, రెవెన్యూ, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, పంచాయతీరాజ్, తదితర 16శాఖల్లో వివిధ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

15.10.2025

మేషం: వ్యాపార వ్యవహారాలలో కొంత జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆర్థిక విషయాలు నిరాశాజనకంగా సాగుతాయి. మాతృ సంభంధిత అనారోగ్యములు కొంత బాధిస్తాయి. సన్నిహితులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. ఉద్యోగమున శ్రమాధిక్యత పెరుగుతుంది.

వృషభం: స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో నూతన పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపార ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు. మిత్రులతో సభ, సమావేశాలలో పాల్గొంటారు. రావలసిన సొమ్ము సకాలంలో అందుతుంది.

మిథునం: వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. సన్నిహితులతో మాటపట్టింపులు తప్పవు. చేపట్టిన పనుల్లో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ధనపరంగా ఇబ్బందులు ఎదురవుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

కర్కాటకం: నూతన వాహనయోగం ఉన్నది. ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

సింహం: నిరుద్యోగులకు మానసిక ఒత్తిడి తప్పదు. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు మరింత బాధిస్తాయి. ఋణ దాతల ఒత్తిడి పెరుగుతుంది. దూర ప్రయాణ సూచనలున్నవి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

కన్య: ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి..వ్యాపార, ఉద్యోగాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు.

తుల: వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగాలు దక్కుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. యాణాలలో కొత్త వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

వృశ్చికం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. సన్నిహితులతో మాటపట్టింపులు ఉంటాయి. ఉద్యోగాలలో సమస్యలు అధిగమించి ముందుకు సాగుతారు. నూతన వాహనయోగం ఉన్నది. వృత్తి వ్యాపారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు.

ధనస్సు: దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.చిన్ననాటి మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది ముఖ్య వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు తప్పవు.

మకరం: వ్యాపార ఉద్యోగాలలో అనుకున్న మార్పులు చోటుచేసుకుంటాయి. ఆత్మీయుల నుంచి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

కుంభం: వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. పాత రుణాలు తీర్చగలుగుతారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: బంధువులతో శుభకార్య విషయమై చర్చలు చేస్తారు. సన్నిహితులతో వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో అంతంత మాత్రంగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ముఖ్యమైన పనులు వాయిదా వెయ్యడం మంచిది. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు.

# సునీత ఏడుపు డ్రామా



### అంతా ఆర్టిఫిషియల్ ఏడుపు... మంత్రి పొన్నం వివాదాస్పద వ్యాఖ్యలు

### ఆడకూతురు కన్నీళ్లనూ బీఆర్ఎస్ వదలడం లేదు.. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నిన్న రహమత్ నగర్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో వేదికపై మాట్లాడిన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తన భర్తను గుర్తు చేసుకొని ఉద్వేగానికి లోనయ్యారు. ఆమె కంటతడి పెట్టారు. ఆమె వేదికపై కన్నీరు కార్చడంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మాగంటి సునీతను ఏడవమని ఆ పార్టీ అగ్ర నాయకులే చెప్పి ఉంటారని మంత్రి పొన్నం ప్రభాకర్ అనుమానం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన బూత్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేటీఆర్ ఒత్తిడి మేరకు మాగంటి సునీత వేదికపై ఏడ్చారని, ఇది తనకు చాలా ఆశ్చర్యం వేసిందని అన్నారు. అందరి ముందు మైక్ పట్టుకుని ఏడవమని చెప్పే రాజకీయం చాలా దుర్మార్గమైనదని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక ఆడకూతురు కన్నీళ్లను కూడా బీఆర్ఎస్ వదిలిపెట్టేలా లేదని ఆయన అన్నారు. అలాంటి మార్గంలో అధికారంలోకి రావాలని, ఈ రాష్ట్రాన్ని గతంలో వలె దోచుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అంతకు ముందు, పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ, మాగంటి సునీత ఏడిచే విధానం చూస్తుంటే, పార్టీ నాయకుల సూచనతోనే కృత్రిమ ఏడుపుగా కనిపి స్తోందని అన్నారు. ఆమె పట్ల తమకు సానుభూతి ఉన్నప్పటికీ, రాజకీయాలు వేరు అన్నారు. వేదికలపై, రాజకీయ ప్రసంగాల మధ్య సానుభూతి ఓట్ల కోసం కన్నీళ్లు పెట్టాలనుకోవడం సరికాదని అన్నారు. సినిమాల్లో చూసినట్లుగా ఉందని అన్నారు.



# నాపై రెడ్ల కుట్ర

మొదటి పేజీ తరువాయి

కొనసాగుతున్నారు. కాలుష్య నియంత్రణ బోర్డులో కాంట్రాక్టు ప్రాతిపదికన ఏడాది కాల వ్యవధితో ఓఎస్డీగా 2023 డిసెంబరు 17న సుమంత్ నియమితులయ్యారు. ఆ తర్వాత ఈ ఏడాది డిసెంబరు 16 వరకు కాంట్రాక్టు పొడిగించారు. పీసీబీ కాంట్రాక్టు ఉద్యోగిగా నియమితులై మంత్రి వద్ద ఓఎస్డీగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో పాలనాపరమైన కారణాలతో సుమంత్‌ను తొలగిస్తున్నట్లు పీసీబీ సభ్య కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆరోపణల నేపథ్యంలోనే సుమంత్‌పై వేటు వేసినట్లు తెలుస్తోంది.

# రెడ్లు లేకుండా బతక్కగలరా?

మొదటి పేజీ తరువాయి

రిజర్వేషన్లు ఇవ్వాలని ఇంద్రాసహానీ కేసులో స్పష్టంగా చెప్పారన్నారు. 1970కి ముందు మున్నూరు కాపులు ఓసీల్లో ఉన్నారని ఆ తర్వాత వారిని బీసీల్లో చేర్చారని చెప్పారు. నిజానికి వీళ్లు ఆర్థికంగా, రాజకీయంగా బాగానే ఉన్నారని, అలాంటివాళ్లకు రిజర్వేషన్లు ఎందుకు అని ప్రశ్నించారు. బీసీలకు వచ్చే ఫలాలన్నీ మున్నూరు కాపులే తీసుకుంటున్నారని ఆరోపించారు. మిగతా బీసీ కులాలకు రిజర్వేషన్లకు ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదన్నారు. ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ట శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మాధవరెడ్డికి తమకు సంబంధం లేదని తెలిపారు. మాధవరెడ్డి గతంలో రెడ్డి జాగృతి విద్యార్థి విభాగంలో పని చేసేవారని, ఆ తర్వాత తమతో విభేధించి వేరేగా పని చేస్తున్నారని చెప్పారు. రాజకీయ పార్టీలు ఆడుతున్న రాజకీయ క్రీడ వల్ల బీసీలు, రెడ్ల మధ్య వైరుధ్యాలు పెరుగుతున్నాయన్నారు. వ్యక్తిగతంగా కోర్టుకు వెళ్లినవారిని పట్టుకుని రెడ్డి సమాజాన్ని దోషులుగా చిత్రీకరిస్తూ గ్రామాల్లో ఉన్న మంచి వాతావరణం చెడగొట్టే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు.

# సునీతకు కేసీఆర్ బీఫాం

మొదటి పేజీ తరువాయి

సభ్యులతో వెళ్లి కలిసి.. పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సునీత గెలవాలని కేసీఆర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాగంటి గోపీనాథ్ కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, బుధవారం సునీత సాదాసీదాగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈనెల 19వ తేదీన భారీ ర్యాలీతో రెండో సెట్ నామినేషన్ దాఖలు చేస్తారు. ఇప్పటికే మాగంటి సునీతకు మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు.



# ఐదేళ్లు ఉంటేనే డీసీసీ

మొదటి పేజీ తరువాయి

నారాయణ స్వామి, కేంద్ర మాజీ మంత్రి సీపీ జోషి, సీడబ్ల్యుసీ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు శాసనసభ్యులు వంటి సీనియర్ నేతలు ఉన్నారు. వారు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాగా, డీసీసీల ఎంపికపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పందించారు. డీసీసీ అధ్యక్షులుగా దరఖాస్తులు చేసుకునే వారు కనీసం 5 ఏళ్ల పాటు నిరంతరంగా పార్టీలో క్రమశిక్షణతో పని చేసి ఉండాలని, అలా లేని వారిని ఏఐసీసీ పరిశీలకులే తొలగిస్తారని వెల్లడించారు. పార్టీకి సంబంధించిన ప్రజా ప్రతినిధుల దగ్గర బంధువులకు కూడా అవకాశాలు లేవని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళ నాయకులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. జిల్లాలోని సమావేశాలు అక్కడి నాయకుల ఇళ్లల్లో, వారి సొంత కార్యాలయాల్లో పెట్టారాదని కేవలం పార్టీ కార్యాలయం లేదా అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతంలోనే సమావేశాలు నిర్వహించాలన్నారు. అలాగే ఏఐసీసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓట్ చోరీ కార్యక్రమంలో గ్రామంలో కనీసం వంద మంది సంతకాలు చేయించి పంపించాలని సూచించారు.

# మల్లోజుల గన్ డౌన్

మొదటి పేజీ తరువాయి



ఉన్న 60 మందిని వెంట తీసుకెళ్తానని చెప్పారు. ఇంత నష్టానికి, ఇన్ని బలిదానాలకు దారి తీసిన విప్లవోద్యమ బాధ్యతల్లో కొనసాగడానికి తాను ఎంత మాత్రమూ అర్హుడిని కాదని కూడా వివరించారు. ప్రస్తుతం పార్టీ కష్టకాలంలో ఉండగా.. తానిలాంటి నిర్ణయం తీసుకోవడం సరైనది కాదని, కాకపోతే పరిస్థితుల దృష్ట్యానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు ప్రభుత్వ దళాల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారని.. మిగతా వారినైనా బతికించుకోవాలనే ఆశతోనే తాను లొంగిపోతున్నట్లు స్పష్టం చేశారు. అయితే మల్లోజుల రాసిన ఈ లేఖను హిడ్మా, దేవ్‌జీలు తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా అవేమీ పట్టించుకోని మల్లోజుల నేడు పోలీసుల ఎదుట లొంగిపోయారు. అగ్రనేత నుంచి ఇలాంటి ప్రకటన రాగానే.. ఉద్యమంలో తీవ్ర అలజడి మొదలైంది. దీని ఫలితంగానే మల్లోజుల కంటే ముందుగానే చాలా మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి పోలీసుల ఎదుట లొంగిపోయారు.

## సుప్రీంలో ఎస్ఎల్పీ

మొదటి పేజీ తరువాయి

మాత్రమే దాన్నో మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందనీ పిటిషన్‌లో పేర్కొంది. ప్రత్యేక సందర్భాల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్ని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం తెలంగాణలో జరిగిందని.. సామాజి క, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024-25లో రాష్ట్ర జనాభాలో 56.33% మంది బీసీలు ఉన్నారని తెలిపింది. రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొం ది. తమిళనాడు గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తావిం చింది. ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన బిల్లులకు మూడు నెలల్లోపు గవర్నర్ ,రాష్ట్రపతి ఆమో దం తెలుపకపోతే వాటికి ఆమోదము ద్ర వేసినట్లుగానే భావించాల్సి ఉంటుందని.. ఈ విషయాలను పరిగణ లోకి తీసుకోవాలంటూ పిటిషన్‌లో పేర్కొంది.

## గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

మొదటి పేజీ తరువాయి

ఉద్యోగాలకు వీరిని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో గ్రూప్ 2 ఉద్యోగాల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లపై సీఎస్ రామకృష్ణరావు సమీక్ష నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. సుమారు 30 ఏళ్ల పాటు సర్వీసులో ఉండనున్నందున.. ప్రభుత్వ ఉద్యోగం పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమం నిర్వహించాలని సీఎస్ పేర్కొన్నారు. సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్ రాజ్, బీఎండీ ఎక్కా, రిజ్వీ, సందీప్ కుమార్ సుల్తానియా, లోకేశ్ కుమార్, టీకే శ్రీదేవి, ఆర్.వి.కర్ణన్, ప్రియాంక, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్య, ఉద్యోగవాణి

### యూపీఎస్సీ దరఖాస్తు రెండ్రోజులే

మొత్తం పోస్టులు: 474
దరఖాస్తు చివరి తేదీ: అక్టోబర్ 16, 2025
అర్హత: డిప్లొమా, ఇంజినీరింగ్, ఎమ్మెస్సీ
పరీక్ష విధానం: ఆన్‌లైన్
ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు రుసుము: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ వారికి ఎలాంటి ఫీజు లేదు, ఇతరులకు రూ.200



# బనకచర్ల ఆపండి

మొదటి పేజీ తరువాయి

జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పోలవరం - బనకచర్ల విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా నిలువరించాలని కోరారు. టెండర్, భూసేకరణ విషయంలో ముందుకెళ్లకుండా చూడాలని విన్నవించారు.

**106 మంది ఇంజినీర్లు బదిలీ**

హైదరాబాద్ సర్కిల్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 106 మంది ఇంజినీర్లను బదిలీ చేస్తూ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌వోసీల జారీ విషయంలో ఇంజినీర్లపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. బదిలీ అయిన ఇంజినీర్లలో ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు ఉన్నారు. గతంలో వచ్చిన ఆరోపణలతోపాటు, క్షేత్ర స్థాయిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడంతో సమూల ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం క్షేతస్థాయి ఇంజినీర్లను బదిలీ చేసింది. హైదరాబాద్ సర్కిల్ పరిధిలోనే 60 మందికిపైగా ఇంజినీర్లపై బదిలీ వేటు వేశారు.

# రెండు రోజుల్లో 21 నామినేషన్లు దాఖలు

## ఇంకా నామినేషన్లు వేయని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం రెండో రోజు మరో 11 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. దీంతో ఇప్పటివరకు నామినేషన్లు వేసిన వారి సంఖ్య 21కి చేరినట్లు రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం వెల్లడించారు. రెండో రోజు నామినేషన్లు వేసిన వారిలో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారని ఆయన తెలిపారు. మంగళవారం పత్రాలు సమర్పించిన వారిలో పాట పార్టీ తరఫున ఎం. వెంకట్ రెడ్డి, అన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి మహమ్మద్ మన్సూర్ అలీ, శరంజీవి పార్టీకి చెందిన జాజుల భాస్కర్, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ నుంచి ఎల్. చంద్రశేఖర్ వంటి వారు ఉన్నారు. సోమవారం నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవగా, ఇప్పటివరకు ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తమ అభ్యర్థుల తరఫున నామినేషన్లు దాఖలు చేయకపోవడం గమనార్హం. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (బీఆర్ఎస్) జూన్‌లో మరణించడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా గోపీనాథ్ అర్ధాంగి మాగంటి సునీతను ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ నవీన్ యాదవ్‌ను బరిలోకి దించింది. బీజేపీ తన అభ్యర్థిని ఒకటి రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశం ఉంది. 2023 ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్, కాంగ్రెస్ అభ్యర్థి, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్‌పై 16,337 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆయన గుండెపోటుకు చికిత్స పొందుతూ మరణించారు. దాంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంలో ఉప ఎన్నినిక అనివార్యమైంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు ఉంది. 22న నామినేషన్ల పరిశీలన, 24 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. నవంబర్ 11న పోలింగ్ నిర్వహించి, 14న ఓట్లను లెక్కించనున్నారు. మరోవైపు, ఉప ఎన్నికలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నియోజకవర్గంలో 'స్వీప్' (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా యువ ఓటర్లను ప్రోత్సహించేందుకు ఎన్నికల ప్రక్రియ, కొత్త ఓటరు నమోదు, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా వివరాల సవరణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెడతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నియోజకవర్గం అంతటా ఓటరు చైతన్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.




## సంగారెడ్డిలో కారులోంచి 20 లక్షలు చోరీ

సంగారెడ్డి, అక్టోబర్ 14 (ఈవార్తలు): సంగారెడ్డిలో కారు అద్దాలు పగులగొట్టి రూ. 20 లక్షలు దోపిడీ చేసిన ఘటన జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ముజాఫిర్ అనే వ్యక్తి సంగారెడ్డిలో తన ఇంటిని విక్రయించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రూ. 20 లక్షల నగదుతో కారులో బయలుదేరారు. సంగారెడ్డిలోని క్లాసిక్ గార్డెన్ వద్ద బంధువుల ఇంటి ముందు కారును ఆపి లోపలకి వెళ్లారు. అదే సమయంలో, ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు కారు అద్దాలను పగులగొట్టి రూ. 20 లక్షలను అపహరించారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో సంగారెడ్డి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నగదును దోచుకెళ్లిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## మల్లారెడ్డి మాస్ ప్రచారం

**పాపను ఎత్తుకొని డ్యాన్స్, సెలూన్ షాప్‌లో కటింగ్**

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో వినూత్న ప్రచారం**

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రచారం ఊపందుకుంది. నిన్నటి నుంచి నామినేషన్ ప్రక్రియ షురూ అయింది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ఇదివరకే ప్రకటించాయి. బీజేపీ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తరఫున ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నియోజకవర్గంలో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. ఒక చాయ్ దుకాణంలో వారు టీ అందించి ఓటర్లను ఆకర్షించారు. మల్లారెడ్డి ప్రచారం సందర్భంగా సందడి చేశారు. ఒక సెలూన్‌లో హెయిర్ కట్ చేస్తూ ఓటు అభ్యర్థించారు. మరోచోట పాపను ఎత్తుకుని డ్యాన్స్ చేశారు. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన బాకీ కార్డును కూడా మల్లారెడ్డి ఓటర్లకు అందించారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ బాకీ కార్డును విడుదల చేసింది. "కారు గుర్తుకే మన ఓటు, కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి, మాగంటి సునీత నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం సాగించారు.



## రిజర్వేషన్లు బీసీల హక్కు

**దయా దాక్షిణ్యాలపై ఇచ్చేవి కావు**

**కోదండరాం కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): రిజర్వేషన్లు బీసీల హక్కు అని, దయా దాక్షిణ్యాల మీద ఇచ్చేవి కాదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. సమానత్వపు పునాదులపై కొత్త సమాజం ఏర్పాటు చేసేందుకే అవి ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధన కోసం ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వర్‌రావు నేతృత్వంలో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సంఘాలతో కలిసి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. " రిజర్వేషన్ల అంశంపై కొన్ని పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయి. కేసులు వేసిన వ్యక్తులకు మద్దతు తెలుపుతూ.. బీసీలకు అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నాయి. తెజసకి రెండు నాలుకల ధోరణి లేదు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. కేంద్రంపైన ఒత్తిడి తీసుకొచ్చి బీసీ బిల్లును ఆమోదించేందుకే మా పోరాటం" అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తామని తెజస ఉపాధ్యక్షుడు పీఎల్. విశ్వేశ్వర్‌రావు అన్నారు. సుప్రీం కోర్టులో న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. 16న గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై తెజస పలు తీర్మానాలు చేసింది. బీసీ సంఘాలు 18న నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంలో న్యాయం లేదని ఎంపీ, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి కన్వీనర్ ఆర్. కృష్ణయ్య తెలిపారు. స్టే ఇవ్వడం ద్వారా బీసీల నోటికాడ ముద్దను లాక్కుందని వ్యాఖ్యానించారు. బీసీల వాదన వినకుండా కోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందన్నారు.

# ఐక్లౌడ్ పాస్‌వర్డ్ ఇవ్వాల్సిందే

**ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు ఆదేశం**

**పాస్‌వర్డ్ మర్చిపోయాను అంటే కుదరదు**

**ఫోరెన్సిక్ సమక్షంలో పాస్‌వర్డ్ రీసెట్ చేయాలని సూచన**



న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన తన ఐక్లౌడ్ సహా ఇతర క్లౌడ్ ఖాతాల ఐడీ, పాస్‌వర్డ్‌లను ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) తప్పనిసరిగా అందించాలని మంగళవారం స్పష్టం చేసింది. ఈ కేసులో ఆయన అరెస్ట్‌పై మధ్యంతర రక్షణను పొడిగిస్తూనే, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది. తాను తన ఐక్లౌడ్ ఖాతా పాస్‌వర్డ్‌ను మర్చిపోయానని, అది చాలా పాతదని ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం, సిట్ ఎప్పుడు పిలిచినా ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పాస్‌వర్డ్‌ను రీసెట్ చేసి, యాక్టివేట్ చేయాలని ఆదేశించింది. విచారణ బృందానికి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించకపోవడం వల్ల కేసులో పురోగతి లేదని తెలిపారు. ఆయన తన డివైజ్‌లను ఫార్మాట్ చేసి కీలకమైన ఎలక్ట్రానిక్ ఆధారాలను నాశనం చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈ ఆరోపణలను ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది డి.ఎస్. నాయుడు ఖండించారు. తన క్లయింట్ వ్యక్తిగత ఐక్లౌడ్ పాస్‌వర్డ్ మినహా అడిగిన అన్ని వివరాలనూ సిట్‌కు ఇచ్చారని, ఇప్పటికే 11 సార్లు విచారణకు హాజరై 18 గంటల పాటు ప్రశ్నలకు సమాధానమిచ్చారని తెలిపారు. భద్రతా నిబంధనల ప్రకారమే డిపార్ట్‌మెంట్ కంప్యూటర్ నిపుణులు డేటాను తొలగించారని, అందులో తన క్లయింట్ పాత్ర లేదని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభాకర్ రావు నేతృత్వంలోని ప్రత్యేక బృందం ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, జర్నలిస్టులు, చివరికి న్యాయమూర్తుల ఫోన్లను కూడా అక్రమంగా ట్యాపింగ్ చేసిందన్నది ప్రధాన ఆరోపణ. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేసి అమెరికా వెళ్లారు. ఈ కేసు వెలుగులోకి రావడంతో ఆయన పేరు నిందితుల జాబితాలో చేరింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో జూన్ 8న భారత్‌కు తిరిగి వచ్చి విచారణను ఎదుర్కొంటున్నారు.

## సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుంది:: మహేశ్ కుమార్ గౌడ్



న్యూఢిల్లీ: పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, ఇప్పుడు మాట మారుస్తున్నాయని అన్నారు.

## బ్యాంకుల తీరుపై మాల్యా మండిపాటు

లండన్: బ్యాంకుల నుంచి తీసుకున్న వేల కోట్ల రుణాలను తీర్చకుండా విదేశాలకు పారిపోయిన ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా తాజాగా భారతీయ బ్యాంకులపై తీవ్రంగా మండిపడ్డారు. బ్యాంకుల తీరు సరిగా లేదని, తన ఆస్తుల రికవరీకి సంబంధించిన వివరాలను దాస్తున్నాయని ఆయన ఆరోపించారు. తాను తీసుకున్న రుణాల కన్నా ఎక్కువగా బ్యాంకులు రికవరీ చేశాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి కూడా ఈ విషయాన్ని అంగీకరించారని, తన ఆస్తుల రికవరీ ద్వారా బ్యాంకులు రూ.14,100 కోట్ల మేర సేకరించాయని చెప్పారన్నారు. దాదాపు రూ.10,200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారి కూడా తెలిపారని మాల్యా గుర్తుచేశారు. ఆస్తుల రికవరీ ద్వారా తన రుణానికి సంబంధించిన చెల్లింపులు పూర్తయినా బ్యాంకులు మాత్రం రికవరీ ప్రక్రియను ఆపలేదని ఆయన విమర్శించారు. రికవరీ చేసుకున్న సొమ్ముపై భారతీయ బ్యాంకులు పూర్తి వివరాలను వెల్లడించేవరకు తాను యూకేలో ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోనని విజయ్ మాల్యా స్పష్టం చేశారు. తన ఆస్తుల రికవరీకి సంబంధించిన ఖాతా వివరాలను అందించాలని విజయ్ మాల్యా పలుమార్లు కోర్టుల ద్వారా బ్యాంకులను అభ్యర్థించారు.

# మారనున్న ఇంటర్ పరీక్షల షెడ్యూల్

## ప్రభుత్వానికి బోర్డు ప్రతిపాదన.. జేఈఈ, నీట్ ప్రిపరేషన్‌కు సమయం ఇచ్చేలా ప్రణాళిక



హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): తెలంగాణ ఇంటర్ విద్యార్థులకు ఇది ముఖ్యమైన వార్త. రాష్ట్రంలో వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను మార్చేందుకు ఇంటర్ బోర్డు సిద్ధమైంది. జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు విద్యార్థులకు తగిన సమయం ఇచ్చే లక్ష్యంతో, ఈసారి ఫిబ్రవరి చివరి వారం నుంచే పరీక్షలు ప్రారంభించాలని భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ ఆమోదం కోసం దస్త్రాన్ని పంపింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, 2026 ఫిబ్రవరి 23 లేదా 25వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభించేందుకు వీలుగా రెండు వేర్వేరు టైం టేబుళ్లను రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున, ఆయన ఆమోదముద్ర వేసిన వెంటనే అధికారిక షెడ్యూల్ వెలువడనుంది. పొరుగు రాష్ట్రమైన ఏపీలో కూడా ఫిబ్రవరి 23 నుంచే పరీక్షలు మొదలుకానున్న నేపథ్యంలో తెలంగాణలోనూ అదే తరహాలో నిర్వహించాలని బోర్డు యోచిస్తోంది. గతంలో ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరిలోనే జరిగేవి. కానీ, కరోనా మహమ్మారి కారణంగా కొన్నేళ్లుగా మార్చి నెలకు వాయిదా పడుతూ వస్తున్నాయి. దీనివల్ల జేఈఈ మెయిన్, ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఉదాహరణకు గతేడాది మార్చి 5న ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా, ఏప్రిల్ 2 నుంచే జేఈఈ మెయిన్ తుది విడత మొదలైంది. దీంతో ప్రిపరేషన్‌కు కేవలం 12 రోజుల సమయం మాత్రమే లభించింది. ఈ ఇబ్బందిని అధిగమించేందుకే ఈసారి వారం రోజుల ముందుగా పరీక్షలు నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. ఇదే సమయంలో, పరీక్ష ఫీజులను పెంచాలంటూ ఇంటర్ బోర్డు ప్రభుత్వానికి మరో ప్రతిపాదన పంపింది. ప్రస్తుతం ప్రాక్టికల్స్ లేని కోర్సులకు రూ. 520, ఎంపీసీ, బైపీసీ వంటి ప్రాక్టికల్స్ ఉన్న కోర్సులకు రూ. 750 చొప్పున ఫీజు వసూలు చేస్తున్నారు. ఏపీ, సీబీఎస్ఈ వంటి ఇతర బోర్డులతో పోలిస్తే తెలంగాణలో ఫీజులు తక్కువగా ఉన్నాయని, వాటిని సవరించాలని బోర్డు కోరింది. ప్రభుత్వ ఆమోదం లభిస్తే, ప్రాక్టికల్స్ లేని కోర్సులకు ఫీజు రూ. 600కు, ప్రాక్టికల్స్ ఉన్నవాటికి రూ. 875కు పెరిగే అవకాశం ఉంది. కాగా, ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి సుమారు 9 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

# కేటీఆర్ బుద్ధి సరిగా లేదు

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తు అయిన 'కారు'ను ఉద్దేశించి ఆయన చేసిన వ్యంగ్యాస్త్రాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. బీజేపీ గుర్తు అయిన తామర పువ్వుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు బండి సంజయ్ తనదైన శైలిలో బదులిచ్చారు. "బుద్ధి సరిగ్గా లేని వారే తామర పువ్వు దేవుడి పూజకు పనికిరాదని మాట్లాడుతారు. బ్రహ్మ, విష్ణువు, లక్ష్మీదేవి, సరస్వతీ దేవి అందరూ తామర పువ్వుతో సంబంధం ఉన్నవారే. నీరు ఎంత పెరిగినా తామర పువ్వు నీటికి అంటకుండా పైనే ఉంటుంది. మా పార్టీ కూడా అలాగే అన్ని సమస్యలను అధిగమించి ఉన్నత స్థాయికి ఎదుగుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకోవాలంటూ కేటీఆర్‌కు హితవు పలికారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. "కారు గుర్తు ఉన్న పార్టీ వాళ్లు తమ పరిస్థితిని తాము చూసుకోవాలి. వాళ్ల కారు ఇప్పటికే రిపేర్‌కు కూడా పనికిరాకుండా షెడ్డులో పడింది" అని ఎద్దేవా చేశారు. కనీసం సెకండ్ హ్యాండ్‌లో ఆ కారును కొనడానికి కూడా ఎవరూ సిద్ధంగా లేరంటూ బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తోంది.

## జూబ్లీహిల్స్‌లో ఓట్ల చోరీ అబద్ధం

**బీఆర్ఎస్ ఆరోపణలను కొట్టేసిన ఈసీ**

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కొన్ని ఇంటి నంబర్ల మీద భారీ సంఖ్యలో ఓట్లు నమోదు అయ్యాయంటూ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేతలు చేసిన ఆరోపణలపై హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి (డీఈవో) ఆర్వీ కర్ణన్ స్పష్టత నిచ్చారు. ఈ వ్యవహారంపై జరిపిన విచారణలో ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆయన సోమవారం తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నేతలు ఆరోపించిన చిరునామాలు బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లకు చెందినవని విచారణలో తేలిందని ఆయన వివరించారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఫ్లాట్లు ఉండటంతో ఓటర్ల సంఖ్య అధికంగా కనిపించిందని తెలిపారు. 8-3-231/బీ/118 చిరునామాలో 50 మంది, 8-3-231/బీ/119లో 10 మంది, 8-3-231/బీ/164లో 8 మంది, 8-3-231/బీ/160లో 43 మంది ఓటర్లు ఉన్నారని, వారంతా అక్కడి ఫ్లాట్లలో నివసిస్తున్నవారేనని స్పష్టం చేశారు. ఈ ఓటర్లందరి పేర్లు 2023 నుంచే జాబితాలో ఉన్నాయని, వారు గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును కూడా వినియోగించుకున్నారని ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. సరైన చిరునామాల ఆధారంగానే వారికి ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేశామని, ఈ చిరునామాలపై కొత్తగా ఒక్క నమోదు కాలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విచారణతో బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తేలింది.



## కిషన్ రెడ్డి గారూ.. ఎన్ని ఓట్లతో ఓడిపోతారు?

**మీ గౌరవం ప్రమాదంలో ఉంది: రాజాసింగ్**

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేస్తే ఎన్ని ఓట్ల తేడాతో ఓడిపోతారని కిషన్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించడం పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉందని రాజాసింగ్ గుర్తుచేశారు. "కిషన్ రెడ్డి గారూ, జూబ్లీహిల్స్‌లో మీరు బీఆర్ఎస్‌ను గెలిపిస్తారా లేక కాంగ్రెస్‌ను గెలిపిస్తారా? అని ప్రజలు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఇది మీ గౌరవానికి సంబంధించిన విషయం" అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా, "ఒకవేళ మీరు భారీ ఓట్ల తేడాతో ఓటమి పాలైతే కేంద్రంలోని పెద్దల ముందు మీ ముఖం ఎలా చూపిస్తారు? ఈ విషయం గురించి కొంచెమైనా ఆలోచించారా?" అని విమర్శించారు. తనపై వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, "నన్ను నాశనం చేసి బయటకు పంపించారు. ఏదో ఒక రోజు మీరు కూడా కచ్చితంగా వెళ్తారు" అంటూ కిషన్ రెడ్డిపై రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. గత కొంతకాలంగా కిషన్ రెడ్డి, రాజాసింగ్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజా వ్యాఖ్యలతో వీరి మధ్య ఉన్న విభేదాలు మరోసారి స్పష్టంగా బయటపడ్డాయి.

## సోషల్ వాణి



లొంగిపోయిన పాకిస్థాన్ సైనికుల ప్యాంట్లు, తుపాకులు సిటీ సెంటర్లో వేలాడదీసిన ఆఫ్ఘన్ తాలిబాన్ సైనికులు. ఇంకా నయం ప్యాంట్లూ షర్టులూ లేని పాక్ సైనికులను వేలాడదీయలా సంతోషం. మూర్ఖపు బ్యాచ్‌కు ఎవరూ ఐడియా ఇవ్వలేదనుకుంటా.

- ఉత్తిష్ఠ భారత



# మేడిపల్లిలో గంజాయి పట్టివేత

మేడిపల్లి అక్టోబర్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మేడిపల్లి గ్రామ శివారులో మంగళవారం గంజాయి పట్టుకున్నట్లు మేడిపల్లి ఎస్సై ఎం శ్రీధర్ రెడ్డి తెలిపారు. కథలాపూర్ మండలం తాండ్రియాలకు చెందిన బద్దం నాగరాజు (26) అనుమానంగా కనిపించగా అతన్ని తనిఖీ చేయగా 200 గ్రాముల గంజాయి దొరికిందని వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు గంజాయి గురించి ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు అందించాలని ఎస్సై కోరారు. గంజాయి కలిగి ఉన్నా, విక్రయించినా, సరఫరా చేసినా, వారికి సహకరించినా చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# జగిత్యాల ఫొటోగ్రాఫర్లకు ఆహ్వానం: ఎస్పీ



జగిత్యాల టౌన్, అక్టోబర్ 14 (ఈవార్తలు): అక్టోబర్ 21న 'పోలీస్ ఫ్లాగ్ డే'ను పురస్కరించుకొని పోలీస్ సంబంధిత అంశంపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ తీసేందుకు ఆసక్తి ఉన్న ఫొటోగ్రాఫర్లు ముందుకు రావాలని ఎస్పీ అశోక్ కుమార్ కోరారు. పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండేలా తీసిన 3 ఫొటోలు, 3 నిమిషాలకు మించకుండా తక్కువ నిడివి గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 23 సాయంత్రంలోగా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన మూడు షార్ట్ ఫిలింలను, ఫొటోలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు.

# 30 వేల లంచం.. పట్టుబడ్డ సర్వేయర్



సిరిసిల్ల, అక్టోబర్ 14 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏసీబీ అధికారులు మరోసారి తన దాడితో సంచలనాన్ని సృష్టించారు. భూమి సర్వే కోసం లంచం తీసుకుంటుండగా సిరిసిల్ల మండల సర్వేయర్ వేణును ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇరుకుల ప్రవీణ్ అనే వ్యక్తికి చిన్న బోనాలలో మూడు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని సర్వే చేయడంలో భాగంగా సర్వేయర్ వేణు రూ.30 వేలు లంచం కోరినట్లు తెలుస్తోంది. దీంతో బాధితుడు ఇరుకుల ప్రవీణ్ కరీంనగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందుగా సర్వేయర్‌కి రూ.10 వేలు అప్పజెప్పగా, తర్వాత పంచనామా సర్టిఫికెట్ కోసం మిగతా రూ.20 వేలు అందజేయడానికి ఒప్పుకున్నాడు. ఈ సమాచారం ఆధారంగా ఏసీబీ అధికారులు సిరిసిల్ల ఎమ్మార్వో కార్యాలయంలో మాటు వేశారు. బాధితుడు చేతిలోని రూ.20 వేల లంచం తీసుకుంటున్న వేణును ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనతో జిల్లా అధికార వర్గాల్లో కలకలం రేగింది. ఇది రాజన్న సిరిసిల్ల జిల్లాలో తక్కువ సమయంలో జరిగిన రెండో సర్వేయర్ అరెస్ట్ కావడం గమనార్హం. గత మే నెలలో ఎల్లారెడ్డిపేట సర్వేయర్ లంచం కేసులో పట్టుబడగా, ఇప్పుడు సిరిసిల్ల సర్వేయర్ వేణు ట్రాప్‌లో చిక్కుకోవడంతో జిల్లా ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# విశాఖలో గూగుల్ చారిత్రాత్మక ముందడుగు

**జనసేన అధినేత పవన్ కల్యాణ్ హర్షం**


విజయవాడ, అక్టోబర్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గూగుల్ సంస్థ భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుండటంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఒక చారిత్రాత్మక ముందడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో భారతదేశంలోనే మొట్టమొదటి గిగావాట్–స్కేల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్‌ను విశాఖలో స్థాపించనుండటం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ పరిణామం డిజిటల్ రంగంలో భారతదేశ స్థానాన్ని ప్రపంచ స్థాయిలో మరింత బలోపేతం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కీలక ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ఆవిష్కరణలు వేగవంతం అవుతాయని, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పవన్ కల్యాణ్ అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యువ నిపుణులకు సాధికారత లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి మార్గనిర్దేశం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, దీనిని సాకారం చేసేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ లకు కూడా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ భవిష్యత్తు నిర్మాణానికి కట్టుబడి ఉన్న గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, థామస్ కురియన్ సహా గూగుల్ క్లౌడ్ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# లక్ష కోట్లతో విశాఖకు గూగుల్




**గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు.. దేశ ఐటీ చరిత్రలోనే పెద్ద మలుపు.. ఢిల్లీ వేదికగా హిస్టారికల్ డీల్**

అమరావతి, అక్టోబర్ 14 (ఈవార్తలు): ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ విశాఖలో రూ.1.33 లక్షల కోట్లతో ఏఐ హబ్ ఏర్పాటు చేయనుండడం తెలిసిందే. ఈ మేరకు గూగుల్ ప్రతినిధులతో ఏపీ ప్రభుత్వం నేడు ఢిల్లీలో హిస్టారికల్ డీల్ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం అనంతరం, ఢిల్లీ నుంచి అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు మంగళవారం ఘన స్వాగతం పలికారు. రాష్ట్రానికి గూగుల్ ఏఐ డేటా సెంటర్ రానుండటంపై వారు హర్షం వ్యక్తం చేశారు. "థాంక్యూ సీఎం సార్, గూగుల్ కమ్స్ టు ఏపీ" అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలతో ముచ్చటించిన చంద్రబాబు, ఈ భారీ పెట్టుబడి తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయం వెనుక ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పోషించిన కీలక పాత్రను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గూగుల్ సంస్థతో సంప్రదింపులు మొదలుపెట్టి, నిరంతరం ఫాలో అప్ చేయడం వల్లే ఈ లక్ష్యాన్ని సాధించగలిగామని తెలిపారు. రాష్ట్ర ప్రతిష్ఠ, 'ఏపీ బ్రాండ్' పునరుద్ధరణతోనే 16 నెలల వ్యవధిలోనే ఇలాంటి భారీ పెట్టుబడులను ఆకర్షించగలిగామని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కేవలం ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే కాదని, దేశ ఐటీ రంగంలోనే ఒక పెద్ద మైలురాయిగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. "గతంలో హైదరాబాద్ దశ, దిశను మైక్రోసాఫ్ట్ రాక ఎలా మార్చిందో, నేడు ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ డేటా సెంటర్ అదే పాత్ర పోషిస్తుంది. విశాఖను ఐటీ హబ్‌గా మార్చే మా ప్రయత్నాలలో ఇదొక అతిపెద్ద ముందడుగు" అని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా తన గతానుభవాలను నేతలతో పంచుకున్నారు. "సుమారు 30 ఏళ్ల క్రితం నేను ఐటీ రంగాన్ని ప్రోత్సహించినప్పుడు సమాజంలో దానిపై ఇంత అవగాహన లేదు. భవిష్యత్తు అవకాశాలను ఊహించి ప్రణాళికలు అమలు చేస్తే ఎన్నో విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అప్పట్లో ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్లి పెట్టుబడులు ఆకర్షించిన సందర్భాలు లేవు. కానీ నేను దావోస్ వంటి అంతర్జాతీయ సదస్సులకు వెళ్లి, విదేశాల్లో పర్యటించి పరిశ్రమలను రాష్ట్రానికి తెచ్చేందుకు కృషి చేశాను. ఆ ప్రయత్నాల ఫలితంగానే హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలను తీసుకొచ్చి ఐటీకి బలమైన పునాది వేశాం" అని గుర్తు చేసుకున్నారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి కీలక రంగాలలో విప్లవాత్మక మార్పులు వస్తాయని చంద్రబాబు వివరించారు. ఈ టెక్నాలజీ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి, ముఖ్యంగా సామాన్యులకు అర్థమయ్యేలా వివరించాలని పార్టీ నేతలకు ఆయన సూచించారు. రాష్ట్రానికి వచ్చిన ఈ భారీ పెట్టుబడి ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు.



# కాకినాడ సెజ్ రైతుల భూమి వెనక్కి

**ఎన్నికల హామీని నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్**

**రిజిస్ట్రేషన్‌కు స్టాంప్ డ్యూటీ, ఫీజులు రద్దు**

**బాబు ఆమోదంతో రెవెన్యూ శాఖ ఉత్తర్వులు**



కాకినాడ, అక్టోబర్ 14 (ఈవార్తలు): జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ, రైతుల పక్షాన నిలుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సెజ్ కోసం సేకరించిన 2,180 ఎకరాల భూమిని తిరిగి రైతులకే అప్పగించాలని ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో పిఠాపురం నుంచి పోటీ చేసిన పవన్ కల్యాణ్, కాకినాడ సెజ్ రైతుల సమస్యను పరిష్కరిస్తానని బలంగా హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం జీవో జారీ చేసినా, క్షేత్రస్థాయిలో భూములు రైతులకు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పవన్ దృష్టికి తీసుకువచ్చారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి అవసరాలకు కూడా భూమిని వాడుకోలేకపోతున్నామని రైతులు ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన పవన్, తాను అధికారంలోకి రాగానే ఈ సమస్యను పరిష్కరిస్తానని మాట ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆమోదంతో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ఫలితంగా, కాకినాడ సెజ్ పరిధిలోని 2,180 ఎకరాల భూములను తిరిగి రైతులకు అప్పగించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు ఇచ్చారు. ఈ భూములను రైతుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసేందుకు ఎలాంటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములు వసూలు చేయవద్దని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో కాకినాడ తీరంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాలకు చెందిన సుమారు 1,551 మంది రైతులకు భారీ ఊరట లభించనుంది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, తన ఎన్నికల హామీ పట్ల సానుకూలంగా స్పందించి, రైతుల పక్షాన నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఏపీ మద్యం కుంభకోణం కేసులో వేగవంతమైన దర్యాప్తు



హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి లక్ష్యంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దూకుడు పెంచింది. మంగళవారం ఉదయం హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులోని ఆయన నివాసాలు, కార్యాలయాలపై నాలుగు సిట్ బృందాలు ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నివాసంలో మిథున్ రెడ్డిని అధికారులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019–2024) మద్యం విధానంలో సుమారు రూ. 3,200 కోట్లకు పైగా అవినీతి జరిగిందని సిట్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ కుంభకోణంలో మిథున్ రెడ్డి పాత్ర కీలకంగా ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా అధికారులు కీలక పత్రాలు, ఆర్థిక లావాదేవీల రికార్డులు, ఎలక్ట్రానిక్ పరికరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో మిథున్ రెడ్డిని జూలైలో అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు తరలించగా, ఆ తర్వాత ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసు విచారణలో భాగంగా గతంలోనూ విచారించారు. సిట్ దాఖలు చేసిన 300 పేజీల చార్జ్‌షీట్‌లో మిథున్ రెడ్డిని నాలుగో నిందితుడిగా (ఏ–4) చేర్చారు. మరోవైపు, ఈ దాడులను వైసీపీ తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యలేనని, చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను వేధిస్తోందని ఆ పార్టీ సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, పేర్ని నాని, అంబటి రాంబాబు తదితరులు ఆరోపించారు. మిథున్ రెడ్డి తన ఆస్తులన్నింటినీ ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారని, ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని వారు స్పష్టం చేశారు. తాము న్యాయస్థానాల్లో పోరాడి నిజం నిరూపిస్తామని వైసీపీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని మిథున్ రెడ్డి ఇటీవల కేంద్ర హోంమంత్రికి లేఖ రాయడం, అమెరికా పర్యటనకు అనుమతి కోరుతూ పిటిషన్ దాఖలు చేయడం వంటి పరిణామాల నడుమ ఈ సోదాలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# 'విద్యుత్తు' సమ్మెకు మద్దతు: షర్మిల



విజయవాడ, అక్టోబర్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యోగులు మంగళవారం నుంచి చేపడుతున్న నిరవధిక సమ్మెకు కాంగ్రెస్ పార్టీ తన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఉద్యోగుల డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరి సరికాదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం తన పట్టువిడుపులు ప్రదర్శించి, విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ని తక్షణమే చర్చలకు ఆహ్వానించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, "హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఉద్యోగుల ఉద్యమాన్ని అణచివేయాలని చూడటం అత్యంత దారుణం. ఇది ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం" అని అన్నారు. ఇప్పటికే 58 సార్లు చర్చలు జరిపినా సమస్యను పరిష్కరించకుండా తాత్సారం చేస్తూ, 63 వేల మంది ఉద్యోగులను ప్రభుత్వమే పరోక్షంగా సమ్మె వైపు నెడుతోందని ఆమె ఆరోపించారు. ఉద్యోగులు చెబుతున్న 29 డిమాండ్లు పూర్తిగా న్యాయబద్ధమైనవని, వాటిని తక్షణమే అమలు చేయాలని షర్మిల ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా, 25 ఏళ్లుగా పనిచేస్తున్న 27 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని సంస్థలో విలీనం చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులతో సహా అపరిమిత వైద్య విధానాన్ని అమలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, 7500 మంది జూనియర్ లైన్‌మన్‌లకు పాత సర్వీసు నిబంధనలు వర్తింపజేయాలని, కారుణ్య నియామకాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని సూచించారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏ/డీఆర్‌లను వెంటనే విడుదల చేయడంతో పాటు, విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. విద్యుత్ జేఏసీ చేస్తున్న ఈ ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ పూర్తి అండగా నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు.

# కేసీఆర్ ఫొటో లేకుండానే కవిత యాత్ర



హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. సామాజిక తెలంగాణ లక్ష్యంగా తెలంగాణ వ్యాప్తంగా యాత్ర చేపట్టనున్నారు. తండ్రి కేసీఆర్ ఫొటో కాకుండా ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోతో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు. యాత్ర పోస్టర్లను సిద్ధం చేశారని, యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం (అక్టోబర్15) విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కవిత మేధావులు, విద్యావంతులతో భేటీ కానున్నారు. అక్టోబర్ చివరి వారం నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్ర తెలంగాణలోని అన్నీ జిల్లాలను కవర్ చేస్తూ ఫిబ్రవరిలో ముగియనుంది. కవిత తెలంగాణ యాత్రపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# రాహుల్ గాంధీ రావాలి.. లేకపోతే మేం బీహార్ వస్తాం

**కల్వకుంట్ల కవిత అల్టిమేటం**

చిక్కడపల్లి/హైదరాబాద్, అక్టోబర్ 14 (ఈవార్తలు): గ్రూప్ -1 అభ్యర్థులను కలిసేందుకు చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీకి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెళ్లారు. అయితే.. లైబ్రరీలోకి ఆమెను, జాగృతి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె గేటు వద్దే బైఠాయించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రూప్ -1లో జరిగిన అక్రమాలపై విద్యార్థులతో మాట్లాడేందుకు ఇక్కడికి వచ్చాను.. లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు కేసీఆర్ పరిపాలనలో కూడా అవకతవకలు జరిగాయని విద్యార్థులు చెప్పారు. ఆనాడైనా, ఈనాడైనా విద్యార్థులకు న్యాయం జరగాలనే నేను కోరుతున్నా. విద్యార్థులకు ఉద్యోగాలు రావాలనే తెలంగాణ తెచ్చుకున్నాం. గ్రూప్ -1 లో అక్రమాలు జరిగాయని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. ఈ ఎగ్జామ్ ను రద్దు చేసి మళ్లీ రీ ఎగ్జామ్ పెట్టండని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా రిక్రూట్ మెంట్లు చేసి ఉంటే రాత్రికి రాత్రే అపాయింట్ మెంట్లు ఇవ్వాల్సిన అవసరమేముంది? అని ప్రశ్నించారు. మా పేపర్లను ఇస్తామంటూ ప్రతి విద్యార్థి ఛాలెంజ్ చేస్తున్నాడు.. ఉద్యోగాలు వచ్చిన వారి పేపర్లు బయట పెట్టడానికి ప్రభుత్వానికి భయం ఎందుకు? ర్యాంకర్ల పేపర్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు వెనక్కి పోతుంది. ప్రతిభ, ధైర్యం ఉన్న విద్యార్థులు ఛాలెంజ్ చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు ముందుకు రావటం లేదని ప్రశ్నించారు. అర్హత లేని వారికి ఉద్యోగాలు రావద్దనే మేము కోరుతున్నాం. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను తుంగలో తొక్కి నాన్ లోకల్స్ 8 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. రాహుల్ గాంధీ బీహార్ ఎన్నికల్లో తిరుగుతూ.. తెలంగాణలో విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవటం లేదు. రాహుల్ గాంధీ ఇక్కడకు రావాలి. లేదంటే మేము బీహార్ కు వస్తామని హెచ్చరించారు. బుధవారం కోర్టులో ఈ అంశంపై విచారణ ఉంది. న్యాయమూర్తులు కూడా ఆలోచన చేయాలని కోరుతున్నా. తెలుగులో పరీక్షలు రాసిన విద్యార్థులకు అన్యాయం చేశారు. గ్రూప్ -1 రాసిన వాళ్లలో పోలీసోళ్ల పిల్లలు కూడా ఉన్నారు. మీ పిల్లలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాన్ని ఎందుకు కాపాడుతున్నారని పోలీసులను అడుగుతున్నా. తెలుగు, ఉర్దూ మీడియంలో రాసిన అభ్యర్థులకు అన్యాయం చేశారు. ఇది వరకు ఉన్న ప్రభుత్వం అన్యాయం చేసినందుకే ఆ ప్రభుత్వాన్ని ఓడించారు. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ పేరు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ పాత 50 వేల ఉద్యోగాలే ఇచ్చారు తప్ప ఒక్క కొత్త నోటిఫికేషన్ వేయలేదన్నారు. తెలంగాణలో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం పై పార్లమెంట్ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎందుకు మాట్లాడటం లేదు? అని ప్రశ్నించారు. గ్రూప్–1 విషయంలో డివిజన్ బెంచ్ లో అనుకూలంగా తీర్పు రాకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తామన్నారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా గ్రూప్ -1 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# పరకామణి చోరీ కేసులో సీఐడీ విచారణ షురూ

తిరుమల, అక్టోబర్ 14 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగిన పరకామణి చోరీ కేసుపై ఏపీ సీఐడీ బృందం అధికారికంగా విచారణ ప్రారంభించింది. హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ అధికారులు దర్యాప్తు మొదలు పెట్టారు. సీఐడీ డైరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో ప్రత్యేక బృందం తిరుమలకు చేరుకుని విచారణ చేపట్టింది. శ్రీవారి ఆలయ పరకామణి ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం, కేసు నమోదైన తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. సమాచారం ప్రకారం, 2023 మార్చిలో పరకామణిలో 920 అమెరికన్ డాలర్లు చోరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో టీటీడీ ఉద్యోగి రవికుమార్ నిందితుడిగా పట్టుబడ్డాడు. అయితే, సంఘటనపై టీటీడీ పూర్తిస్థాయి విచారణ జరపలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. తర్వాత లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకొని అప్పటి పాలకవర్గం కేసును మూసివేసిందనే ఆరోపణలతో హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్ను విచారించిన హైకోర్టు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిజానిజాలు వెలికి తీసేందుకు సీఐడీ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో పరకామణి కేసు విచారణను సీఐడీ ప్రారంభించింది. మరోవైపు టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి సీఐడీ డీజీని కలిసి తన వద్ద ఉన్న ఆధారాలను సమర్పించారు. సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

# పూరన్‌ది దళితుల సమస్య

**ఐపీఎస్ సూసైడ్‌పై రాహుల్ సంచలన వ్యాఖ్యలు**

చండీగఢ్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ మృతి వెనుక ప్రభుత్వ వివక్ష ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానాలో పూరన్ కుమార్ నివాసానికి వెళ్లిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూరన్ కుమార్ మరణం కేవలం ఒక కుటుంబానికి సంబంధించిన విషయం కాదని, ఇది దళితుల సమస్య అని వ్యాఖ్యానించారు.

# అమెరికా పాస్‌పోర్ట్ పవర్ పడిపోయే!

## 20 ఏళ్లలో తొలిసారి టాప్ 10 జాబితా నుంచి ఔట్.. అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా సింగపూర్

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాలో అగ్రరాజ్యం అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గత 20 ఏళ్లలో మొదటిసారిగా యూఎస్ పాస్‌పోర్ట్ టాప్ 10 జాబితా నుంచి బయటకు వచ్చింది. అంతర్జాతీయ వాయు రవాణా సంస్థ డేటా ఆధారంగా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అమెరికా 12వ స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం మలేషియాతో కలిసి యూఎస్ ఈ స్థానంలో ఉంది. ఒకప్పుడు, అంటే 2014లో, ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్న అమెరికా పాస్‌పోర్ట్ హోల్డర్లు ఇప్పుడు కేవలం 180 దేశాలకు మాత్రమే వీసా లేకుండా ప్రయాణించగలుగుతున్నారు. మరోవైపు, ఈ జాబితాలో సింగపూర్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. సింగపూర్ పాస్‌పోర్ట్‌తో 193 దేశాలకు వీసా ఫ్రీ సదుపాయంతో వెళ్లవచ్చు. ఆ తర్వాత స్థానాల్లో దక్షిణ కొరియా (190), జపాన్ (189) ఉన్నాయి. అమెరికా ర్యాంక్ పడిపోవడానికి పలు దేశాలు తమ వీసా నిబంధనలను మార్చడమే ప్రధాన కారణమని నివేదిక స్పష్టం చేసింది. ఈ ఏడాది బ్రెజిల్ వీసా రహిత ప్రవేశాన్ని రద్దు చేయడం, వీసా అవసరం లేని దేశాల జాబితాలో అమెరికాను చైనా చేర్చకపోవడం, మయన్మార్, పపువా న్యూగినియా వంటి దేశాలు కొత్త ప్రవేశ ఆంక్షలు విధించడం యూఎస్ ర్యాంక్‌పై ప్రభావం చూపాయి. తాజాగా వియత్నాం, సోమాలియా కూడా అమెరికన్లకు వీసా నిబంధనలను కఠినతరం చేశాయి. ఈ విషయంలో యూకే పరిస్థితి కూడా బాగోలేదు. గతంలో టాప్‌లో ఉన్న బ్రిటన్, ఇప్పుడు ఆరో స్థానం నుంచి ఎనిమిదో స్థానానికి పడిపోయింది. ఆసక్తికరంగా, హెన్లీ ఓపెన్‌నెస్ ఇండెక్స్ ప్రకారం, ఇతర దేశాల పౌరులను ఆహ్వానించడంలో అమెరికా చాలా వెనుకబడి ఉంది. అమెరికా పౌరులకు 180 దేశాలు వీసా ఫ్రీ ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండగా, అమెరికా మాత్రం కేవలం 46 దేశాల పౌరులను మాత్రమే వీసా లేకుండా తమ దేశంలోకి అనుమతిస్తోంది. దీంతో ఈ జాబితాలో అమెరికా 77వ స్థానంలో నిలిచింది. మరోవైపు చైనా ఈ విషయంలో వేగంగా దూసుకెళుతోంది. గత పదేళ్లలో చైనా తన పాస్‌పోర్ట్ ర్యాంకును 94 నుంచి 64కు మెరుగుపరుచుకుంది. అంతేకాకుండా, 76 దేశాల పౌరులకు వీసా రహిత ప్రవేశం కల్పిస్తూ ఓపెన్‌నెస్ ఇండెక్స్‌లో 65వ స్థానంలో నిలిచి అమెరికాను అధిగమించింది.








# సూర్యుడు చిన్నబోతున్నడు!

## దేశంలో తగ్గుతున్న సూర్యరశ్మి గంటలు.. వాయు కాలుష్యం, మేఘాలే ప్రధాన కారణం



న్యూఢిల్లీ: సౌరశక్తి రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్న భారతదేశానికి ఒక కొత్త సవాలు ఎదురవుతోంది. గత మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా సూర్యరశ్మి భూమిని తాకే సమయం (ఎండ గంటలు) క్రమంగా తగ్గుతున్నట్లు భారత శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో వెల్లడైంది. వాయు కాలుష్యం, మేఘాలు, స్థానిక వాతావరణ పరిస్థితులే ఈ మార్పునకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఈ పరిణామం దేశ సౌరశక్తి లక్ష్యాలతో పాటు వ్యవసాయ రంగంపైనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగురు భారతీయ శాస్త్రవేత్తలు కలిసి నిర్వహించిన ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత 'సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. బనారస్ హిందూ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ, భారత వాతావరణ శాఖకు చెందిన శాస్త్రవేత్తలు 1988 నుంచి 2018 మధ్య కాలంలో దేశంలోని 20 వాతావరణ కేంద్రాల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించారు. ఈశాన్య రాష్ట్రాల్లో స్వల్ప మినహాయింపులు ఉన్నప్పటికీ, దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ఏటా సూర్యరశ్మి గంటలు తగ్గుతున్నట్లు ఈ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని అమృత్‌సర్, కోల్‌కతా వంటి నగరాలతో పాటు, హిమాలయ ప్రాంతాలు, ముంబై వంటి పశ్చిమ తీర ప్రాంతాల్లో ఈ తగ్గుదల అత్యధికంగా ఉన్నట్లు గుర్తించారు. గాలిలో తేలియాడే అతి సూక్ష్మ ధూళి కణాలు (ఏరోసోల్స్) ఈ సమస్యకు మూల కారణంగా ఉన్నాయి. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వాతావరణంలోకి చేరే ఈ కణాలు సూర్యరశ్మిని నేరుగా భూమిని చేరకుండా అడ్డుకుంటున్నాయి. "ఈ ఏరోసోల్స్ వల్ల మేఘాలు ఎక్కువసేపు వర్షించకుండా నిలిచిపోతున్నాయి. ఫలితంగా అవి సూర్యరశ్మిని మరింతగా అడ్డుకుంటున్నాయి" అని అధ్యయన బృందంలోని బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ పరిస్థితి దేశ సౌర విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఐఐటీ కాన్పూర్ శాస్త్రవేత్త సచ్చిదా నంద్ త్రిపాఠి ప్రకారం, వాయు కాలుష్యం కారణంగా సోలార్ ప్యానెళ్ల సామర్థ్యం ఇప్పటికే గరిష్ఠంగా 41% వరకు తగ్గుతోంది. దీనివల్ల ఏటా 245 మిలియన్ల నుంచి 835 మిలియన్ డాలర్ల మేర విద్యుత్ ఉత్పత్తికి నష్టం వాటిల్లుతోంది. ఇదే సమయంలో దేశంలోని అత్యంత కలుషిత ప్రాంతాల్లో వరి, గోధుమ వంటి పంటల దిగుబడి 36% నుంచి 50% వరకు పడిపోవడానికి కూడా ఈ కాలుష్యమే కారణమని ఆయన వివరించారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలన్న భారత్ లక్ష్యానికి తగ్గుతున్న సూర్యరశ్మి గంటలు పెద్ద అడ్డంకిగా మారే అవకాశం ఉంది. ప్రపంచంలోని ఇతర దేశాలైన యూరప్, చైనాలు కూడా గతంలో ఇలాంటి సమస్యను ఎదుర్కొన్నాయి. అయితే కఠినమైన కాలుష్య నియంత్రణ చట్టాల ద్వారా యూరప్ ఈ సమస్యను అధిగమించి మళ్లీ సూర్యరశ్మిని పొందగలిగింది. భారత్ కూడా కాలుష్యాన్ని నియంత్రించడంలో విఫలమైతే, సౌరశక్తి ప్రణాళికలు నీరుగారిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## త్వరలోనే ట్రంప్, కిమ్ భేటీ!

న్యూయార్క్/ప్యాంగ్యాంగ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మధ్య మరోసారి కీలక సమావేశం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెలాఖరులో జరగనున్న ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (ఏపీఈసీ) సదస్సు సందర్భంగా ఈ భేటీ జరగవచ్చని దక్షిణ కొరియా కీలక ప్రకటన చేసింది. ఇరు దేశాల సరిహద్దులోని పాన్‌మున్‌జోమ్ గ్రామం ఈ చారిత్రక సమావేశానికి వేదిక కావచ్చని అంచనా వేసింది. మంగళవారం పార్లమెంటులో జరిగిన ఆడిట్ సెషన్‌లో ఈ అంశంపై అధికార డెమోక్రటిక్ పార్టీ ఎంపీ యూన్ హు-దుక్ అడిగిన ప్రశ్నకు దక్షిణ కొరియా ఏకీకరణ మంత్రి చుంగ్ డాంగ్-యంగ్ సమాధానమిచ్చారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఇరు దేశాల నేతలు చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ట్రంప్‌తో తనకు 'మంచి జ్ఞాపకాలు' ఉన్నాయంటూ ఇటీవల కిమ్ చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. దీనిబట్టి షరతులతో కూడిన చర్చలకు కిమ్ సుముఖంగా ఉన్నట్లు అర్థమవుతోందని వివరించారు. ఉత్తర కొరియాపై ఉన్న అణ్వస్త్ర నిర్మూలన డిమాండ్‌ను అమెరికా పక్కన పెడితే చర్చలకు సిద్ధమని గత నెలలో కిమ్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, దక్షిణ కొరియాతో అమెరికా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలపై చర్చించేందుకు ట్రంప్ సుముఖత వ్యక్తం చేస్తే ఈ సమావేశం జరిగే ఆస్కారం ఉందని మంత్రి చుంగ్ అభిప్రాయపడ్డారు. "ఇక నిర్ణయం తీసుకోవాల్సింది ట్రంప్ మాత్రమే" అని ఆయన స్పష్టం చేశారు. ఈ నెలాఖరులో దక్షిణ కొరియాలోని గ్యాంగ్‌జూ నగరంలో ఏపీఈసీ సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ట్రంప్ దక్షిణ కొరియా రానున్నారు.

# తక్కువ డోస్‌తో ఎక్కువ ప్రభావం

**కొత్త యాంటీబయోటిక్ అభివృద్ధి**

న్యూఢిల్లీ: వైద్య శాస్త్రంలో ఒక కొత్త అధ్యయనం కీలక ఆవిష్కరణకు దారితీసింది. పేగుల్లో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే 'సి. డిఫిసిల్' అనే ప్రమాదకరమైన బ్యాక్టీరియాను అతి తక్కువ మోతాదులో యాంటీబయాటిక్ వాడి నియంత్రించవచ్చని పరిశోధకులు కనుగొన్నారు. ఈవీజీ7 అనే ఈ కొత్త యాంటీబయాటిక్, కేవలం చిన్న డోసుతోనే ఈ బ్యాక్టీరియాను సమర్థవంతంగా నాశనం చేయడమే కాకుండా, ఇన్‌ఫెక్షన్ మళ్లీ తిరగబెట్టకుండా నివారిస్తున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. 'సి. డిఫిసిల్' అనేది పేగుల్లో నివసించే ఒక మొండి బ్యాక్టీరియా. ముఖ్యంగా వయసు పైబడిన వారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఇది తీవ్రమైన అనారోగ్యానికి కారణమవుతుంది. ఈ బ్యాక్టీరియా విడుదల చేసే ఒక విష పదార్థం వల్ల తీవ్రమైన డయేరియా వస్తుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతో ఇన్‌ఫెక్షన్ తగ్గినా, తరచుగా మళ్లీ తిరగబెట్టడం ఒక పెద్ద సమస్యగా ఉంది. "ప్రస్తుత యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేసిన కొన్ని వారాలకే ఈ ఇన్‌ఫెక్షన్ మళ్లీ బయటపడుతుంది. ఎందుకంటే ఈ బ్యాక్టీరియా తన వెనుక 'స్పోర్'లను వదిలి వెళుతుంది. ఈ స్పోర్‌లు అనుకూల పరిస్థితుల్లో తిరిగి కొత్త బ్యాక్టీరియాగా మారి ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతాయి" అని ఈ పరిశోధన బృందానికి నేతృత్వం వహించిన ఎల్మా మాన్స్ వివరించారు.

# దేశానికి రక్షణ కవచం ఎన్‌ఎస్‌జీ

**కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి**

**హర్యానాలో ఎన్‌ఎస్‌జీ 41వ ఆవిర్భావ వేడుకలు**


**అయోధ్యలో ఎన్‌ఎస్‌జీ హబ్ ఏర్పాటు చేస్తామని ప్రకటన**



మానేసర్: ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలకు వ్యతిరేకంగా నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జీ) దేశానికి ఒక బలమైన రక్షణ కవచంలా పనిచేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారు. హర్యానాలోని మానేసర్‌లో మంగళవారం జరిగిన ఎన్‌ఎస్‌జీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన భద్రతా సిబ్బందికి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అమిత్ షా కీలక ప్రకటన చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఎన్‌ఎస్‌జీ కొత్త హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్, జమ్మూలలో హబ్‌లు ఉండగా, అయోధ్యతో వాటి సంఖ్య ఏడుకు చేరుకుంటుందని వివరించారు. దీనివల్ల ఉగ్రవాద ముప్పును వేగంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. అక్షరధామ్ ఆలయంపై దాడి, 26/11 ముంబై దాడులు, పలు బందీల విముక్తి ఆపరేషన్ల వంటి క్లిష్టమైన సమయాల్లో ఎన్‌ఎస్‌జీ చూపిన ధైర్యసాహసాలను ఆయన గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం 'జీరో టెర్రరిజం' విధానాన్ని అనుసరిస్తోందని అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు 2019 నుంచి యూఏపీఏ, ఎన్ఐఏ చట్టాలకు సవరణలు, టెర్రర్ ఫండింగ్‌ను అరికట్టేందుకు ఈడీ, పీఎంఎల్ఏకు అధికారాలు, పీఎఫ్ఐపై నిషేధం వంటి అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆర్టికల్ 370 రద్దు వంటి చర్యలతో ఉగ్రవాదుల వెన్ను విరిచామని ఆయన పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్', 'ఆపరేషన్ మహాదేవ్' వంటి ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని, ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా తప్పించుకోలేరని హెచ్చరించారు.

# పాక్ మళ్లీ దాడి చేయొచ్చు: సైన్యం

శ్రీనగర్: పాకిస్థాన్ మరో దాడికి ప్రయత్నించే అవకాశం ఉందని వెస్టర్న్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ హెచ్చరించారు. జమ్ము కశ్మీర్‌లో ఆయన మాట్లాడుతూ, పహల్గామ్ తరహాలో పాకిస్థాన్ మరో దాడికి ప్రయత్నిస్తే భారత్ నుంచి తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా గట్టిగా బదులిచ్చినప్పటికీ పాకిస్థాన్ తన వైఖరిని మార్చుకోవడం లేదని విమర్శించారు. పాకిస్థాన్ ప్రతి కదలికపై దృష్టి సారించామని మనోజ్ కుమార్ వెల్లడించారు. ఈసారి అలాంటి దుశ్చర్యకు పాల్పడితే మనం ఇచ్చే సమాధానం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పాకిస్థాన్ దుందుడుకు చర్యలకు పాల్పడితే ఈసారి గట్టి గుణపాఠం చెబుతామని భారత సైన్యం గత నెలలోనే స్పష్టం చేసింది. ఏప్రిల్ 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌కు సమీపంలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన విషయం తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత భారత్ పాకిస్థాన్, పీవోకేలో ఉగ్రవాద నిర్మూలనకు ఆపరేషన్ సిందూర్ నిర్వహించింది.



# బేర్‌మన్న సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో నేడు ప్రతికూల వాతావరణం కనిపించింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు నష్టాలతో ముగిశాయి. దాదాపు అన్ని రంగాల్లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో మార్కెట్లు రోజంతా బలహీనంగా కొనసాగాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 297.07 పాయింట్లు (0.36%) నష్టపోయి 82,029.98 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 81.85 పాయింట్లు (0.32%) తగ్గి 25,145.5 వద్ద ముగిసింది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 25,300%-%25,400 స్థాయిలు కీలక నిరోధకంగా పనిచేస్తున్నాయి. మరోవైపు, 25,000 పాయింట్ల స్థాయి ముఖ్యమైన మద్దతుగా నిలుస్తోంది. ఒకవేళ నిఫ్టీ 25,300 స్థాయిని దాటితే మార్కెట్లో మళ్లీ కొనుగోళ్ల జోరు పెరగవచ్చని, కానీ 25,000 కంటే దిగువకు పడిపోతే 24,850%-%24,700 స్థాయిల వరకు పతనం ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. రంగాల వారీగా చూస్తే, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు భారీగా నష్టపోయాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.52 శాతం పడిపోయింది. వీటితో పాటు కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా రంగాల షేర్లు కూడా పతనమయ్యాయి. బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, టాటా స్టీల్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) వంటి షేర్లు ప్రధానంగా నష్టపోగా, టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్ వంటివి లాభపడి సూచీలకు కొంత ఊరటనిచ్చాయి.

## రాజస్థాన్‌లో ప్రైవేటు బస్సులో మంటలు.. 10 మంది మృతి

జైసల్మేర్: రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వెళుతున్న ఒక ప్రైవేటు బస్సులో మంటలు చెలరేగి 10 మంది దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటనలో పలువురు గాయపడగా, వారిని స్థానిక జవహర్ ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. జైసల్మేర్ నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరిన ప్రైవేటు బస్సు థాయత్ గ్రామ సమీపంలోకి రాగానే వెనుక భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే బస్సు మొత్తం వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్పందించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

## టారిఫ్‌లు భారత్‌ను ఏం చేయలేవు

వాషింగ్టన్: అంతర్జాతీయంగా నెలకొన్న వాణిజ్య సవాళ్లను అధిగమిస్తూ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మంగళవారం భారత్‌కు శుభవార్త చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను భారత జీడీపీ వృద్ధి అంచనాను 6.4 శాతం నుంచి 6.6 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. భారత ఎగుమతులపై అమెరికా భారీ సుంకాలను విధించినప్పటికీ, దేశీయంగా బలమైన పనితీరు కారణంగా ఈ అంచనాను సవరించినట్లు తన 'వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్' నివేదికలో స్పష్టం చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని, గత ఏడాది కాలంలో ఇదే అత్యధికమని ఐఎంఎఫ్ గుర్తు చేసింది. ముఖ్యంగా దేశంలో ప్రైవేటు వినియోగం బలంగా ఉండటమే ఈ వృద్ధికి ఊతమిచ్చిందని తెలిపింది. ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణల ద్వారా వినియోగ వస్తువులపై పన్నులను తగ్గించడంతో దేశీయ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది అమెరికా సుంకాల ప్రభావాన్ని అధిగమించడానికి సహాయపడుతుందని నివేదికలో పేర్కొంది. ఇటీవలే ప్రపంచ బ్యాంకు సైతం భారత వృద్ధి అంచనాను 6.3 శాతం నుంచి 6.5 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఐఎంఎఫ్ కూడా అదే బాటలో పయనించడం భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతను సూచిస్తోంది. ఈ సందర్భంగా ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియేవా భారత్‌పై ప్రశంసలు కురిపించారు. మారుతున్న ప్రపంచ ఆర్థిక క్రమంలో చైనా వృద్ధి నెమ్మదిస్తుండగా, భారత్ ప్రపంచానికి కీలకమైన వృద్ధి ఇంజిన్‌గా అభివృద్ధి చెందుతోందని ఆమె కొనియాడారు. అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇంకా పూర్తిగా గడ్డు పరిస్థితుల నుంచి బయటపడలేదని, రాబోయే రోజుల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. వర్ధమాన దేశాల వృద్ధి రేటు 2026 నాటికి 4 శాతానికి పరిమితం కావచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది.



## నైరుతి బై బై

**ఈశాన్య రాష్ట్రాల నుంచి వెనక్కి: ఐఎండీ**

**శీతాకాలానికి నాంది పలికిన రుతుపవనాలు**

న్యూఢిల్లీ: దేశంలోని ఈశాన్య ప్రాంతం నుంచి నైరుతి రుతుపవనాలు మంగళవారం పూర్తిగా నిష్క్రమించినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు ప్రకటించారు. సరిగ్గా గతేడాది (2024) కూడా ఇదే తేదీన, అంటే అక్టోబర్ 14నే, రుతుపవనాలు ఈ ప్రాంతం నుంచి వెనుదిరగడం ఒక ఆసక్తికరమైన అంశం. ఈ నిష్క్రమణతో ఈశాన్య రాష్ట్రాల్లో వర్షాకాలం ముగిసి, శీతాకాలానికి అధికారికంగా తెరలేచినట్లయింది. వాతావరణ శాఖ అధికారి ఒకరు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈశాన్యంలోని ఎనిమిది రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపురల నుంచి రుతుపవనాలు పూర్తిగా వెనుదిరిగాయి. దీని ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో వాయువ్య దిశ నుంచి పొడి గాలులు వీయడం ప్రారంభమైందని, రానున్న రోజుల్లో గాలిలో తేమ తగ్గి, ఆకాశం చాలావరకు నిర్మలంగా ఉంటుందని తెలిపారు. ఈ మార్పులతో పర్వత ప్రాంతాలు రానున్న వారాల్లో చల్లటి, పొడి వాతావరణానికి సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది దేశంలోకి మే 24న కేరళ ద్వారా ప్రవేశించిన నైరుతి, రెండు రోజుల తర్వాత మే 26న ఈశాన్య ప్రాంతంలోకి అడుగుపెట్టింది. గత ఏడాదుల మాదిరిగానే ఈసారి కూడా ఈశాన్యంలో రుతుపవనాలు సాధారణంగానే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అయితే, అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో మాత్రం రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. కేవలం ఈశాన్య రాష్ట్రాల నుంచే కాకుండా పశ్చిమ బెంగాల్‌తో సహా తూర్పు భారతదేశంలోని చాలా ప్రాంతాల నుంచి కూడా రుతుపవనాలు నిష్క్రమించాయని ఐఎండీ తెలిపింది. రానున్న కొద్ది రోజుల్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఝార▯ండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణతో పాటు దేశంలోని మిగిలిన ప్రాంతాల నుంచి కూడా రుతుపవనాల నిష్క్రమణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అధికారులు అంచనా వేశారు.

## రాష్ట్రం హక్కులను లాక్కుంటారా?

**ఈడీపై సుప్రీంకోర్టు అసహనం.. తమిళనాడు లిక్కర్ స్కాం కేసులో మందలింపు**

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను లాక్కుంటారా అంటూ ఈడీపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. తమిళనాడు మద్యం కుంభకోణం కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీని భారత అత్యున్నత న్యాయస్థానం మందలించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను ఈడీ లాక్కుంటుందా? అలా చేయడం సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం కాదా అని ప్రశ్నించింది. మద్యం రిటైలర్ టాస్మాక్‌లో అవకతవకలపై తమిళనాడు పోలీసులు, అవినీతి నిరోధక శాఖ కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నాయి. అయితే ఆయా కేసుల ఆధారంగా ఈడీ కూడా మనీలాండరింగ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించింది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. తనిఖీలలో ఆధారాలు లభించినట్లు ఈడీ ప్రకటించింది. ఈ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేస్తుండగా ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈడీని ప్రశ్నించింది. రాష్ట్ర పోలీసుల హక్కులను ఉల్లంఘించడమేంటి? మీకు అనుమానం వచ్చినప్పుడల్లా మీరే వెళ్లి దర్యాప్తు చేస్తారా? అని ప్రశ్నించింది. అలాంటప్పుడు సమాఖ్య వ్యవస్థకు అర్థం ఎక్కడ అని వ్యాఖ్యానించింది. ఈ కేసులో తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈ కేసులో పోలీసులు కేసు నమోదు చేసినట్లు కోర్టుకు తెలిపారు. ఈడీ టాస్మాక్ కార్యాలయంలో సోదాలు చేసి ఉద్యోగుల మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులను గంటల తరబడి నిర్బంధించారని కోర్టుకు తెలియజేశారు. ఈడీ ఏదైనా ఇతర నేరానికి సంబంధించిన ఆధారాలను గుర్తిస్తే ఆ సమాచారాన్ని సంబంధిత ఏజెన్సీతో పంచుకోవాలని చట్టం చెబుతోందని వాదనలు వినిపించారు. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ, తమిళనాడు పోలీసులు 47 కేసులు నమోదు చేశారని, ఇంకా అవినీతి కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు. సోదాల్లో పెద్ద మొత్తంలో అక్రమ నగదు, నకిలీ పత్రాలు, ఒప్పంద అక్రమాలకు సంబంధించిన ఆధారాలను గుర్తించినట్లు కోర్టుకు తెలిపారు. ఆధారాలు దొరికినప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు సమర్పించలేదని సీజేఐ ప్రశ్నించారు.

## వయ్యారి చిత్రం



నియతి ఫత్నాని

# 'మీసాల పిల్ల' అదుర్స్



మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రం నుండి మొదటి పాట వచ్చేసింది. ఇప్పటికే అద్భుతమైన స్పందనతో రికార్డు వ్యూస్ సాధించిన ప్రోమో తర్వాత, 'మీసాల పిల్ల' పూర్తి లిరికల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాట సంగీత ప్రియులను, మెగా అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ 'మీసాల పిల్ల' పాట పవర్‌ఫుల్ ఎలక్ట్రానిక్ బీట్స్, పంచ్ బాస్ లైన్స్‌తో మాస్, మెలోడీ కలగలిపిన ఓ అద్భుతమైన ట్రాక్‌గా నిలిచింది. భాస్కరభట్ల అందించిన సాహిత్యం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చాలా కాలం తర్వాత మెగాస్టార్ సినిమా కోసం ప్రముఖ గాయకుడు ఉదిత్ నారాయణ్ గొంతు కలపడం ఈ పాటలో అతిపెద్ద హైలైట్. ఆయన నోస్టాల్జిక్ వాయిస్ పాటకు కొత్త వైబ్ ఇచ్చింది. శ్వేతా మోహన్ గాత్రం మరింత మాధుర్యాన్ని జోడించింది. ఈ పాటలో మెగాస్టార్ చిరంజీవి తన ట్రేడ్‌మార్క్ గ్రేస్, స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్‌తో అదరగొట్టారు. చార్మింగ్, స్టైలిష్ సూట్‌లో ఆయన కనిపించిన తీరు అభిమానులకు కనుల పండుగ చేసింది. విజయ్ పోలాకి కొరియోగ్రఫీలో చిరంజీవి వింటేజ్ డ్యాన్స్ స్టైల్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. అందమైన చీరలో నయనతార మెరిసిపోగా, చిరంజీవి-నయనతార మధ్య కెమిస్ట్రీ మ్యాజికల్‌గా ఉంది. కలర్‌ఫుల్ సెట్స్ మధ్య చిత్రీకరించిన ఈ పాట విజువల్ ట్రీట్‌గా నిలుస్తోంది. హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సుష్మిత కొణిదెల భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తున్నారు. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ అందిస్తున్నారు. మొత్తంమీద సంగీతం, సాహిత్యం, కొరియోగ్రఫీ, లీడ్ పెయిర్ కెమిస్ట్రీ అన్నీ కలిసి 'మీసాల పిల్ల' పాటను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టాయి. 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం 2026 సంక్రాంతికి థియేటర్లలో విడుదల కానుంది.

# మెగాస్టార్ సరసన యంగ్ బ్యూటీ?




మెగాస్టార్ చిరంజీవి స్పీడు చూస్తుంటే కుర్ర హీరోలు కూడా దాన్ని తట్టుకోలేరేమో అనిపిస్తుంది. వరుస సినిమాలను చేస్తూ బిజీగా ఉన్న చిరూ, ఇప్పటికే విశ్వంభర మూవీ షూటింగ్ ను పూర్తి చేసి, ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకరవరప్రసాద్ గారు సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అనిల్ సినిమా అంటే ఎంత స్పీడ్ గా పూర్తవుతుందో తెలిసిందే. శంకరవరప్రసాద్ గారు షూటింగ్ ను పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్న చిరూ, ఓ వైపు ఆ షూటింగ్ ను చేస్తూనే ఇప్పుడు మరో సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లడానికి రెడీగా ఉన్నారు. అనిల్ తో సినిమా తర్వాత మెగాస్టార్.. బాబీ కొల్లి దర్శకత్వంలో ఓ సినిమా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. వాటిలో బాబీ సినిమాను ముందుగా చేయనున్నారు చిరంజీవి. ఈ సినిమాలో ఒక ఫీమేల్ లీడ్ కోసం మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ తో మేకర్స్ డిస్కషన్స్ చేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తలు విని నెటిజన్లు ఒక్కొక్కరు ఒక్కోలా రియాక్ట్ అవుతున్నారు. చిరూ లాంటి సీనియర్ స్టార్ సరసన నటించేందుకు మాళవిక ఒప్పుకుంటుందా అని కొందరు ప్రశ్నిస్తుంటే, మరికొందరు మాత్రం మెగాస్టార్ తో ఛాన్స్ వస్తే వదులుకుంటుందా అని అంటున్నారు.

# దిల్ రాజు ఆపసోపాలు



కొన్నాళ్లుగా దిల్ రాజు బ్యానర్ నుంచి వచ్చిన సినిమాలు అనుకున్న స్థాయి సక్సెస్ అందుకోవడం లేదు. రీసెంట్ టైమ్స్ లో సంక్రాంతికి వస్తున్నాం తప్పించి ఆయనకు, ఆయన బ్యానర్ కు సాలిడ్ హిట్ అనేది లేదు. ఆయనేం చేసినా పెద్దగా కలిసి రావడం లేదు. ఈ విషయాన్ని స్వయంగా దిల్ రాజు కూడా సభా ముఖంగా ఒప్పుకుంటున్నారు. అయితే రీసెంట్ గా పవన్ కళ్యాణ్ ఓజి సినిమాను డిస్ట్రిబ్యూట్ చేసి మళ్లీ మంచి సక్సెస్ ను అందుకున్న దిల్ రాజు, ఆ సినిమా తనకు కొత్త ఎనర్జీని ఇచ్చిందని కూడా స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఆ ఎనర్జీతోనే దిల్ రాజు ఇప్పుడు వరుస సినిమాలను లైన్ లో పెడుతున్నట్టు తెలుస్తోంది. అయితే ఈసారి దిల్ రాజు లైన్ లో పెడుతుంది కేవలం తెలుగు ప్రాజెక్టులు మాత్రమే కాదు, వివిధ ఇండస్ట్రీల నుంచి స్టార్ హీరోలతో రాజు గారు సినిమాలు చేయబోతున్నారని తెలుస్తోంది. తెలుగులో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో సినిమాలను తీయాలని ప్రయత్నిస్తున్న దిల్ రాజు, కోలీవుడ్ లో అజిత్ తో సినిమా తీయాలని చూస్తున్నారట. అవి మాత్రమే కాకుండా బాలీవుడ్ లో అక్షయ్ కుమార్ తో సంక్రాంతికి వస్తున్నాంను రీమేక్ చేయడంతో పాటూ, సల్మాన్ ఖాన్ తో ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో జెర్సీ, హిట్ ది ఫస్ట్ కేస్ సినిమాలతో నిర్మాతగా బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి ఆ సినిమాలతో డిజప్పాయింట్ అయిన దిల్ రాజు, ఇప్పుడు మరోసారి బాలీవుడ్ వైపు కన్నేశారని, ఈసారి ఎలాగైనా అక్కడ సక్సెస్ అందుకోవాలని దిల్ రాజు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఈసారైనా రాజు గారి రిస్క్ కు తగ్గ ఫలితం వస్తుందేమో చూడాలి.



## మళ్లీ తల్లి కాబోతున్న
# ఇలియానా

ముచ్చటగా మూడోసారి తల్లి కాబోతున్నాను అంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చెప్పింది ప్రముఖ స్టార్ హీరోయిన్ ఇలియానా. మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని 2023 మే 13న రహస్యంగా వివాహం చేసుకున్న ఈ బ్యూటీకి ఆగస్టు 2023లో మొదటి కుమారుడు కోవా ఫీనిక్స్ డోలన్ జన్మించాడు. 2024 ఏప్రిల్ లో తన వివాహాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. 2025 జూన్ లో తమ రెండవ కుమారుడు కీనూ రాఫే డోలన్ కి జన్మనిచ్చింది ఈ ముద్దుగుమ్మ. ఇద్దరు కొడుకులకు జన్మనిచ్చిన ఇలియానా ఇప్పుడు మళ్లీ మూడవసారి త్వరలో తల్లి కాబోతున్నానని అభిమానులతో పంచుకుంది. మొత్తానికి అయితే ముచ్చటగా మూడోసారి తల్లి కాబోతోంది ఇలియానా.

# దీపావళి తర్వాతే ఓటీటీలోకి ఓజీ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన 'ఓజీ' సినిమా థియేటర్లలోకి వచ్చి అంచనాలను అందుకుని మంచి మాస్ ట్రీట్ ఇచ్చింది. ఇక ఇప్పుడు ఆ సినిమా ఓటీటీ రిలీజ్‌పై ఫోకస్ పెరిగింది. ఈసారి, ఓటీటీ రిలీజ్ అనేది కేవలం అభిమానులకు బిగ్ ట్రీట్ ఇవ్వడం మాత్రమే కాదు, సినిమా కథాబలం ఎమోషనల్ కనెక్ట్‌ను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై మరోసారి నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని సినిమాలు థియేటర్ లో క్లిక్కయితే ఓటీటీలో ఆడవు. మరికొన్ని థియేటర్స్ ఆడకున్నా ఓటీటీలో క్లిక్కయ్యే ఛాన్స్ ఉంది. ఇప్పుడు ఓజి ఓటీటీ టాక్ ఎలా ఉంటుందనే ఆసక్తి పెరిగింది. 'ఓజీ'కి ఉన్న భారీ డిమాండ్ దృష్ట్యా, ఓటీటీ రిలీజ్ డేట్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. సాధారణంగా పెద్ద సినిమాలు థియేటర్లలో విడుదలైన తర్వాత 4 నుంచి 8 వారాల గ్యాప్‌లో ఓటీటీకి వస్తాయి. ఈ సినిమా నవంబర్ మొదటి వారంలో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. ఈ లెక్కన, దీపావళి పండుగ ముగిసిన వెంటనే, నవంబర్ రెండో వారంలో (అంటే రిలీజ్ అయిన 4-5 వారాల తర్వాత) నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమాను స్ట్రీమింగ్ చేసే అవకాశం ఉంది.



## టాక్సిక్ నుంచి
# యష్ షర్ట్ లెస్ లుక్ లీక్!

కేజీఎఫ్ సిరీస్ లతో దేశవ్యాప్తంగా ఫేమస్ అయ్యారు నటుడు యష్.. ఒకప్పుడు కన్నడ సినిమాలు చేస్తూ కన్నడ వరకే పరిమితమైన ఈయన ఒక్కసారిగా కేజీఎఫ్ సినిమాతో దేశవ్యాప్తంగా వైరల్ అయిపోయారు. ప్రశాంత్ నీల్ డైరెక్షన్లో వచ్చిన కేజీఎఫ్ 1,కేజీఎఫ్ 2 రెండు సినిమాలు యష్ కెరియర్ ని మార్చేశాయి. అయితే ఈ రెండు సినిమాల తర్వాత యష్ టాక్సిక్ మూవీతో మన ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాకి లేడీ డైరెక్టర్ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే తాజాగా యష్ నటిస్తున్న టాక్సిక్ మూవీ నుండి ఒక వీడియో లీక్ అయింది అంటూ ట్విట్టర్ లో ఒక వీడియో హల్చల్ చేస్తోంది. ఆ వీడియోలో యష్ లుక్ చాలా స్టైలిష్ గా కనిపించడమే కాదు.. అది చూసిన ఫ్యాన్స్ ఈ వీడియోని తెగ వైరల్ చేస్తున్నారు.





# సిరీస్ క్లీన్ స్వీప్
## భారత్ ఘన విజయం

వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. 121 పరుగుల లక్ష్యఛేధనలో భాగంగా 63/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన భారత్.. 35.2 ఓవర్లలో 3 వికెట్లకు 124 పరుగులు చేసి గెలుపొందింది. కేఎల్ రాహుల్(108 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 58 నాటౌట్) హాఫ్ సెంచరీతో రాణించాడు. చివరి రోజు ఆటలో సాయి సుదర్శన్(76 బంతుల్లో 5 ఫోర్లతో 39), శుభ్‌మన్ గిల్(13) ఔటైనా.. ధ్రువ్ జురెల్(6 నాటౌట్) సాయంతో రాహుల్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. విండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్‌కు 2 వికెట్లు దక్కగా.. జోమెల్ వారికన్‌కు ఓ వికెట్ దక్కింది. ఈ గెలుపుతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా 2–0తో క్లీన్ స్వీప్ చేసింది. మరో 58 పరుగుల కోసం ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. హాఫ్ సెంచరీ దిశగా సాగిన సాయి సుదర్శన్‌ను రోస్టన్ ఛేజ్ ఔట్ చేయగా.. రాహుల్ 102 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శుభ్‌మన్ గిల్ కూడా త్వరగానే ఔటయ్యాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 518/5 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ కాగా.. భారత్‌కు భారీ ఆధిక్యం తగ్గింది. దాంతో ఫాలో ఆన్ ఆడిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది. జాన్ కాంప్‌బెల్(199 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లతో 115), షైహోప్(214 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 103) సెంచరీలతో చెలరేగగా.. జస్టిన్ గ్రీవ్స్(85 బంతుల్లో 3 ఫోర్లతో 50 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు. జైడెన్స్ సీల్స్(32)తో కలిసి జస్టిన్ గ్రీవ్స్ ఆఖరి వికెట్‌కు 79 పరుగులు జోడించాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా(3/44), కుల్దీప్ యాదవ్(3/104) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్(2/43) రెండు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌కు చెరో వికెట్ దక్కింది.



# కోహ్లీ వచ్చేశాడు

ఆస్ట్రేలియా పర్యటన కోసం టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ భారత్‌లో అడుగుపెట్టాడు. మంగళవారం కింగ్ కోహ్లీ న్యూఢిల్లీకి చేరుకున్నాడు. టీమిండియాతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్ అనంతరం లండన్ వెళ్లిపోయిన కోహ్లీ.. అక్కడే ఫ్యామిలీతో నివాసం ఉంటున్నాడు. వ్యక్తిగత జీవితానికి ఎలాంటి ఇబ్బంది కలగవద్దని, తన పిల్లలు ఎలాంటి స్టార్‌డమ్ లేకుండా స్వేచ్ఛగా పెరగాలనే ఉద్దేశంతో కోహ్లీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ.. ఐపీఎల్ 2025 సీజన్ సమయంలో టెస్ట్ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. కుటుంబానికి సమయం కేటాయించేందుకే కోహ్లీ రిటైర్మెంట్ తీసుకున్నాడని, అనుష్క శర్మ కారణంగానే రెండు ఫార్మాట్లకు వీడ్కోలు పలకాడనే ప్రచారం కూడా జరిగింది. ప్రస్తుతం కోహ్లీ వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆస్ట్రేలియాతో అక్టోబర్ 19 నుంచి ప్రారంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌కు విరాట్ కోహ్లీతో పాటు రోహిత్ శర్మ ఎంపికయ్యాడు. ఈ సిరీస్ ఆడేందుకు విరాట్ కోహ్లీ మంగళవారం భారత్‌కు వచ్చాడు. బ్లాక్ షర్ట్, వైట్ ట్రూజర్‌లో బాలీవుడ్ హీరోను తలపించిన కోహ్లీ..సెక్యూరిటీ మధ్య ఎయిర్ పోర్ట్ బయటకు వచ్చి కారులో వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లే తొలి బ్యాచ్ ఆటగాళ్లు బుధవారం సాయంత్రం ఫ్లైట్ ఎక్కనున్నారు. విరాట్ కోహ్లీతో పాటు రోహిత్ శర్మ తొలి బ్యాచ్‌తోనే ఆసీస్‌కు వెళ్లనున్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియాను శుభ్‌మన్ గిల్ నడిపించనున్నాడు. అతని సారథ్యంలోనే రోహిత్, కోహ్లీ బరిలోకి దిగనున్నారు.

## రోకోకు ఆస్ట్రేలియా సిరీస్ కీలకం: రవిశాస్త్రి

టీమిండియా మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవితవ్యం ఆస్ట్రేలియా పర్యటనతో తేలనుందని మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చడంతో పాటు ఫామ్, ఫిట్‌నెస్ కొనసాగిస్తే వన్డే ప్రపంచకప్ 2027 వరకు కొనసాగుతారని తెలిపాడు. టీ20, టెస్ట్ ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ, రోహిత్ కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే తమ లక్ష్యమని ఈ ఇద్దరూ ఆటగాళ్లు తెలిపారు. అందుకు సన్నదం కూడా అవుతున్నారు. ఐపీఎల్ 2025 సీజన్ అనంతరం పూర్తిగా ఇంటికే పరిమితమైన ఈ ఇద్దరూ సీనియర్ ఆటగాళ్లు.. ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నారు






## 23 ఏళ్ల ఆటగాడిపై విమర్శలా.. సిగ్గుండాలి: గంభీర్

టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్‌పై గౌతమ్ గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. యూట్యూబ్ వ్యూస్ కోసం యువ క్రికెటర్ అయిన హర్షిత్ రాణాపై విమర్శలు గుప్పిస్తారా? అని మండిపడ్డాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేసిన వన్డే, టీ20 జట్లలో హర్షిత్ రాణాకు చోటు దక్కడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. గౌతమ్ గంభీర్‌కు ప్రియ శిష్యుడు కావడంతోనే హర్షిత్ రాణాకు మూడు ఫార్మాట్లలో అవకాశాలు దక్కుతున్నాయని క్రిష్ శ్రీకాంత్‌తో పాటు పలువురు నెటిజన్లు ఆరోపించారు. మూడు ఫార్మాట్లలో ఆడే ప్రతిభ హర్షిత్ రాణాకు లేదని అభిప్రాయపడ్డారు.

## ఫిట్‌నెస్ గురించి అడగలేదేం?
### చీఫ్ సెలెక్టర్‌పై మండిపడిన షమీ

భారత జట్టులో ప్రధాన బౌలర్ అయిన మహమ్మద్ షమీ ప్రస్తుతం గడ్డుకాలం ఎదుర్కొంటున్నాడు. మోకాలి సర్జరీ తర్వాత కోలుకున్న అతడు పునరాగమనం కోసం నిరీక్షిస్తున్నాడు. రంజీలు, దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా సరే సెలెక్టర్లు మొండిచేయి చూపించడంపై షమీ మండిపోతున్నాడు. అంతేకాదు స్క్వాడ్ సెలెక్షన్ ముందు తనను సంప్రదించామని, ఫిట్‌గా లేనందునే పక్కనపెట్టేశామని చెబుతున్న చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై షమీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఫిట్‌నెస్ విషయమై భారత జట్టు, ఛీఫ్ సెలెక్టర్.. ఎవరూ కూడా నన్ను సంప్రదించలేదు. ఒకవేళ నేను ఫిట్‌గా లేకపోతే గమ్మున నేషనల్ క్రికెట్ అకాడమీలో చేరేవాడిని. అంతేతప్ప.. రంజీ ట్రోఫీ కోసం సిద్ధమయ్యేవాడిని కాదు కదా' అని షమీ వెల్లడించాడు.



ఈవార్తలు

ప్రజావాణి

సంపాదకీయం

నేటి ఈవార్తలు

బుధవారం 15-10-2025 | www.evarthalu.com

మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా
అగ్ని, పృథ్వీ క్షిపణుల లీడర్..
ఎస్ఎల్వీ-3 విజేయుడు..
పీపుల్స్ ప్రెసిడెంట్..
పద్మ భూషణుడు..
పద్మ విభూషణుడు..
భారత రత్నాధరుడు..
విజన్ 2020 రూపకర్త..
సామాజిక సేవకుడు..

యువ శాస్త్రవేత్తలకు మోడల్..
విద్యార్థులకు గాడ్ ఫాదర్..
సింపుల్ మ్యాన్..
ఇలా చెప్పుకుంటూ పోతే
ఆయనకు సాటిరారెవరు..!
ఆయనకు సరితూగరెవరు..!!
ఆయనే..
ఏపీజే అబ్దుల్ కలాం.



# ప్రజల రాష్ట్రపతి.. అబ్దుల్ కలాం

**నేడు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తూ..**

ఏపీజే అబ్దుల్ కలామ్.. అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలామ్. అక్టోబర్ 15, 1931న తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించిన ఈయన.. భారత దేశపు క్షిపణి పితామహుడు. దేశానికి 11వ భారత రాష్ట్రపతి. కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో ఒక తమిళ ముస్లిం కుటుంబంలో 1931, అక్టోబరు 15న జన్మించారు. తండ్రి జైనులబ్దీన్, పడవ యజమాని మరియు తల్లి ఆషియమ్మ, గృహిణి. పేద కుటుంబం కావటంతో కుటుంబ అవసరాలకు చిన్న వయసులోనే పని ప్రారంభించారు. పాఠశాల విద్య పూర్తి చేసిన తర్వాత, తన తండ్రికి ఆర్థికంగా ఏ.పి..అబ్దుల్ కలామ్ తోడ్పడటానికి న్యూస్ పేపర్ పంపిణీ చేసేవారు. పాఠశాలలో సగటు మార్కులు వచ్చినప్పటికీ నేర్చుకోవటానికి తపన పడేవారు మరియు ఎక్కువ సమయం కష్టపడేవారు.



రామనాథపురం స్వార్జ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో తన పాఠశాల విద్య పూర్తి చేశాక, కలాం సెయింట్ జోసెఫ్స్ కళాశాల, తిరుచిరాపల్లి చేరి, 1954లో భౌతికశాస్త్రంలో పట్టా పొందారు. అప్పట్లో ఈ కళాశాల మద్రాస్ విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థగా ఉండేది. ఈ కోర్సుపై అతనికి కోర్సు పూర్తి అయ్యేవరకు మక్కువ కలగలేదు. నాలుగు సంవత్సరాలు ఈ కోర్సు చదివినందుకు తరువాత చింతించారు. 1955లో మద్రాసులో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేరారు. కలాం సీనియర్ తరగతి ప్రాజెక్ట్ పనిచేస్తుండగా, పురోగతి లేకపోవడంతో డీన్ అసంతృప్తి చెంది ప్రాజెక్ట్ తదుపరి మూడు రోజుల్లో పూర్తి చేయకపోతే తన స్కాలర్షిప్ రద్దుచేస్తాను అని బెదిరించాడు. ఇచ్చిన గడువులో కష్టపడి పని పూర్తిచేసి డీన్‌ను ఆకట్టుకున్నాడు. తరువాత డీన్ "కలాం నీకు తక్కువ గడువు ఇచ్చి ఎక్కువ ఒత్తిడి కలిగించాను" అన్నారు. ఎనిమిది స్థానాల కొరకు జరిగిన ప్రవేశ పరీక్షలో తొమ్మిదో స్థానం పొంది యుద్ధ పైలట్ కావాలనే తన కలను తృటిలో కోల్పోయారు. చెన్నైలోని మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి పట్టా పొందిన తరువాత 1960లో, కలాం డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఏరోనాటికల్ డెవెలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ శాస్త్రవేత్తగా చేరారు. కలాం భారత సైన్యం కోసం ఒక చిన్న హెలికాప్టర్ చెయ్యటం ద్వారా తన వృత్తిని ప్రారంభించాడు, కానీ డీఆర్డీవోలో ఉద్యోగం చేయడంతో ఆయన సంతృప్తి చెందలేదు. 1969లో, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థలో(ఇస్రో) చేరి, ఇస్రో యొక్క మొట్టమొదటి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం ప్రయోగానికి డైరెక్టర్‌గా పనిచేసి జూలై 1980లో ఈ వాహనం రోహిణి ఉపగ్రహాన్ని భూమి దగ్గర కక్ష్యలో విజయవంతంగా చేర్చింది. ఇస్రోలో పనిచేయడం తన జీవితంలో అతిపెద్ద విజయాల్లో ఒకటిగా పేర్కొన్నారు. 1970 మరియు 1990 మధ్య కాలంలో, కలాం పోలార్ ఎస్ఎల్వీ, ఎస్ఎల్వీ-3 ప్రాజెక్టుల అభివృద్ధికి పనిచేశారు. రెండు ప్రాజెక్టులు విజయవంతం అయ్యాయి. 1970లలో స్థానికంగా తయారైన ఎస్ఎల్వీ రాకెట్ ఉపయోగించి రోహిణి-1 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపడం ఇస్రో చరిత్రలో మైలురాయి. జూలై 1992 నుంచి డిసెంబరు 1999 మధ్య ప్రధానమంత్రి శాస్త్రీయ సలహాదారుగా, డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరించారు. ఇదే సమయంలో జరిపిన పోఖ్రాన్లో-2 అణు పరీక్షలలో కలాం రాజకీయ, సాంకేతిక పాత్ర నిర్వహించారు.

భారత దేశపు మూడు అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ భూషణ్ (1981లో), పద్మ విభూషణ్ (1990లో), భారత రత్న (1997లో) లతో పాటు నలభై వర్సిటీల గౌరవ డాక్టరేట్లు, పొందిన కలాం.. జూలై 18, 2002న 90% పైగా ఓట్లతో భారత రాష్ట్రపతిగా ఎన్నికై, జూలై 25న పదవీ స్వీకారం చేశారు. ఆయన్ను ఆ పదవికి తమ అభ్యర్థిగా నిలబెట్టింది అప్పటి అధికార పక్షమైన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే. కలామ్ శాకాహారి, మద్యపాన వ్యతిరేకి, బ్రహ్మచారి. కచ్చితమైన వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తారు. "ప్రజలు తమ భార్యాపిల్లలకు తమ పిల్లల పిల్లలకూ ఆస్తులు సంపాదించి పెట్టటం కోసమే అవినీతిపరులౌతారు" అంటూ ఆయన పెళ్ళి చేసుకోలేదు. ఇస్లాం ప్రకారమైతే ప్రతి ముస్లిమూ పెళ్ళి చేసుకోవాలి. ఖురాన్‌తోపాటు భగవద్గీతను కూడా చదివేవారు. మతఘర్షణలను నిరసించే శాంతికాముకుడు, మానవతావాది. ఆయన తిరుక్కురళ్లో చెప్పిన మార్గాన్ని అనుసరిస్తారు. ఆయన చేసే ప్రతి ప్రసంగంలోనూ కనీసం ఒక్క "పాశురం" నైనా ప్రస్తావిస్తారు. కలాం రాజకీయంగా భారత దేశం అంతర్జాతీయ సంబంధాలలో మరింత దృఢమైన నిర్ణయాలు తీసుకుని నిర్ణయాత్మక పాత్ర పోషించాలని కోరుకున్నారు. తాను సుదీర్ఘ కాలం కృషి చేసి అభివృద్ధి చేసిన అణ్వాయుధ కార్యక్రమం, కాబోయే ప్రపంచ ప్రబల శక్తిగా భారతదేశ స్థానాన్ని సుస్థిరం చేసే సాధనాల్లో ఒకటిగా ఆయన భావించేవారు. ఆయన భారతదేశపు యువతను వెన్ను తట్టి ప్రోత్సహించే ఉద్దేశంతో పాఠకుల్ని ఉత్తేజితుల్ని చేసే తన ఆత్మ కథ వింగ్స్ ఆఫ్ ఫైర్ లాంటి పుస్తకాలు అనేకం రాశఆరు. 2020 సంవత్సరానికల్లా భారత దేశాన్ని ఒక వైజ్ఞానిక ప్రబల శక్తిగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను ఆయన చాలా బలంగా తెచ్చారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో చురుకైన పాత్ర పోషించారు. బయో ఇంప్లాంట్స్ వాడటం ద్వారా తెలివిని పెంచడానికి ఒక పరిశోధనా కార్యక్రమాన్ని ప్రతిపాదించారు. ఆయన ప్రొప్రైటరీ సాఫ్ట్‌వేర్ కంటే ఓపెన్ సోర్సు సాఫ్ట్‌వేర్‌నే సమర్థిస్తారు. ఓపెన్ సోర్సు సాఫ్టువేర్‌ను పెద్ద ఎత్తున వాడడం వల్లే సమాచార విప్లవం ఫలాలు ఎక్కువ మందికి అందుతాయని ఆయన విశ్వాసం.

రాష్ట్రపతి పదవిని చేపట్టినా సామాన్యుడిలాగే జీవితం గడిపిన కలాం మన అందరికీ ఆదర్శనీయం. మన జీవితంలో ఇంకో కలాంను చూడలేం. ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన పీఎం నాయర్ ఓ ఇంటర్వ్యూలో ఆయన గురించి ఆసక్తికరమైన విషయాలను



వెలువరించారు. రాష్ట్రపతి హోదాలో విదేశాల్లో పర్యటించినపుడు ఆయనకు ఆయా దేశాధినేతలు ఇచ్చిన బహుమతులను తిరస్కరిస్తే వారిని అవమానించినట్టేనని భావించి, అది భారత్‌ను కూడా ఇరకాటంలో పెడుతుందని వాటిని తీసుకునేవారు. స్వదేశానికి తిరిగి రాగానే వాటికి ఫోటోలు తీసి, కెటలాగు తయారు చేయించి ఆర్కైవ్స్‌లో భద్రపరిచేవారు. పదవీ కాలం పూర్తయిన తర్వాత అందులో ఒక్క పెన్సిల్ కూడా తీసుకోలేదు. 2002లో రంజాన్ సందర్భంగా రాష్ట్రపతి ఇచ్చే ఇఫ్తార్ విందుకు ఎంత ఖర్చు అవుతుంది అని కలాం అడిగారు. దీనికి దాదాపు రూ.22 లక్షలు ఖర్చు అవుతుందని నాయర్ చెప్పారు. శ్రీమంతులకు విందు ఇవ్వడానికి అంత ఖర్చు పెట్టడం అవసరమా? ఆ సొమ్మును నిరుపేదలకు బ్లాంకెట్లు, బట్టలు, ఆహారం కోసం కేటాయించి, అనాథాశ్రమాలకు ఇవ్వాలని చెప్పారు. అంతేకాదు అనాథాశ్రమాలను ఎంపిక చేసే పని కొందరికి అప్పజెప్పారు తప్ప ఆయన జోక్యం చేసుకోలేదు. ఎంపికచేసిన తర్వాత నాయర్‌ను గదిలోకి పిలిచి తన వ్యక్తిగత సంపాదనలో రూ.లక్ష ఇచ్చి, దీని గురించి ఎవరికీ చెప్పకండి అన్నారు. ఈ విషయం అందరికీ చెబుతాను నాయర్ అంటే ఆయన వద్దు అన్నారు. ఇఫ్తార్ విందు ఇవ్వని నిఖార్సయిన ముస్లిం రాష్ట్రపతి అబ్దుల్ కలాం. తన మాటలకు అందరూ తలూపాలలనే నైజం కలాంకు లేదు. ఒకసారి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో చర్చల సందర్భంగా నాయర్ అభిప్రాయం అడిగితే ఆయన నో సర్ అన్నాడు. దీనికి కలాం మౌనంగా ఉండిపోయారు. సమావేశం పూర్తయిన తర్వాత నాయర్‌ను ప్రధాన న్యాయమూర్తి పిలిచి అలా నో అన్నారేంటి అని అడిగారు. సర్ నా అభిప్రాయం అడుగుతారు... నేను చెప్పింది విన్నాక అవసరమైతే తన అభిప్రాయాన్ని మార్చుకుంటారని నాయర్ బదులిచ్చారు. దీనికి ప్రధాన న్యాయమూర్తి ఆశ్చర్య పోయారు.

ఒకసారి కలాం తన బంధువులను సుమారు 50 మందిని రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానించారు. వారికి అయిన ఖర్చును వ్యక్తిగత ఖాతా నుంచి చెల్లించారు. అధికారిక వాహనం కూడా వారికి కేటాయించలేదు. వారికోసం అయిన సుమారు రూ.2 లక్షలను తనే చెల్లించారు. దేశ చరిత్రలో ఇలాంటి సంఘటన ఇంతకు మునుపు ఎప్పుడూ జరగలేదు. కలామ్ తన సోదరుడిని ఒక వారం రోజులు రాష్ట్రపతి భవన్‌లో ఉంచినందుకు ఆయన అద్దె చెల్లిస్తానన్నారు. దీనికి మాత్రం ఎవరూ ఒప్పుకోలేదు. దేశానికి అధ్యక్షుడు తన నివాసంలో సొంత అన్నను వారం రోజులు ఉంచినందుకు అద్దె చెల్లించాలి అనే నిజాయితీని భరించలేమని ఒప్పుకోలేదని నాయర్ అన్నారు. రాష్ట్రపతి భవన్ వదిలి వెళ్లే ముందు అందరూ కుటుంబాలతో వెళ్ళి కలిస్తే, పేరు పేరునా పలకరించారు. అయితే నాయర్ భార్య ఆనారోగ్యంతో రాలేకపోయారు. మీ భార్య ఎందుకు రాలేదని? అడిగిన కలామ్ కారణం తెలుసుకుని మర్నాడు వారి ఇంటికి వెళ్లారు. ఏంటీ హడావుడి అని అడిగితే రాష్ట్రపతి మీ ఇంటికి వస్తున్నారు అని చెప్పారు. ఇంతవరకూ ప్రపంచంలో ఏ దేశాధినేత తన వద్ద పనిచేసే ఒక ఉద్యోగి భార్య అనారోగ్యంతో ఉందని తెలిసి ఇంటికి వెళ్లి పరామర్శించినట్టు చరిత్రలో ఎక్కడా జరగలేదు. మూడు ప్యాంట్లు, ఆరు షర్టులు, మూడు సూట్లు, ఒక చేతిగడియారం, 2500 పుస్తకాలు, బెంగళూరులోని సైంటిస్ట్ కమ్యూనిటీ ఆయనకు ఎప్పుడో ఇచ్చిన ఒక ఇల్లు, ఇంచుమించు సున్నా బ్యాంకు నిల్వ, 120 మంది కోట్ల భారతీయుల ప్రేమాభిమానాలే ఆయన ఆస్తి. భారత అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నతోపాటు పద్మభూషణ్, పద్మవిభూషణ్‌లు అందుకున్నారు. 2015 జులై 27న ఐఐఎం షిల్లాంగ్‌లో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కలాం గుండెపోటుతో కుప్పకూలిపోయారు.

## కలాం మాటల్లో..

ఉదయం నాలుగు గంటలకు నిద్ర లేచేవాడ్ని. మా అమ్మ ఉదయాన్నే నన్ను నిద్ర లేపేది. అప్పుడు స్నానం చేసి లెక్కల ట్యూషన్‌కి వెళ్లేవాడ్ని. స్నానం చేసి రాకపోతే మా మాస్టర్ పాఠాలు చెప్పేవారు కాదు. నేను ట్యూషన్ పూర్తి చేసుకొచ్చేసరికి మా నాన్న నన్ను నమాజ్‌కు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉండేవారు. ఆ కార్యక్రమం పూర్తి అయ్యాక రైల్వేస్టేషన్‌కి వెళ్లేవాణ్ణి. మద్రాసు నుంచి వచ్చే దినపత్రికల పార్సిల్‌ని తీసుకొని వాటిని పంపిణీ చేసేవాడ్ని. ఈ విధంగా పనిచేస్తూనే చదువుకున్నా. మాది ఉమ్మడి కుటుంబం. సభ్యులు ఎక్కువ మంది ఉండేవారు. మా అమ్మ మాత్రం నాకు మిగతా వారికన్నా ఎక్కువ తిండి పెట్టేది. ఇంట్లో నేను చివరివాడ్ని. దానికితోడు చదువుకుంటూ పని చేయడం వల్ల మా అమ్మ నాపై చాలా శ్రద్ధ చూపేది. మా ఇంట్లో ఆనందం, విషాదం రెండూ ఉండేవి. నాకు ముగ్గురు అమ్మలు. ఒకరు మా సొంత అమ్మ. మరొకరు భారత సంగీతానికి అమ్మ ఎంఎస్ సుబ్బలక్ష్మి. మరొకరు ప్రపంచానికి అమ్మ మదర్ థెరిస్సా. 1950లో తిరుచ్చిలో తాను చదువుకుంటున్నప్పుడు విన్న 'ఎందరో మహానుభావులు.. అందరికీ వందనాలు' అన్న పాట నన్ను పరవశంలో ముంచెత్తింది. అప్పటి నుంచి ఎంఎస్ సుబ్బలక్ష్మి సంగీతాన్ని ఎంతగానో అభిమానించాను. ఆమె భారతరత్న అవార్డు తీసుకునే సమయంలో నా తల నిమిరింది. ఆ ఘటనను నేనెప్పటికీ మరవలేను. దేశం కాని దేశంలో పుట్టి, మన దేశానికి నలభై ఏళ్ల పాటు అమూల్య సేవల్ని అందించిన మదర్ థెరిస్సా నేను అభిమానించే మూడో అమ్మ.



రణధీర్ గుండు
99666 30743

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.